Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 178 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 19 జూలై 2023 | బుధవారం | పేజీలు : 4

## పాత విధానంలోనే ఎంబీబీఎస్ కౌన్సెలింగ్

హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి ఈ ఏడాది పాత విధానంలోనే కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) స్పష్టతను ఇచ్చింది. 2023-24 విద్యాసంవత్సరానికి నీట్-యూజీలో అర్హత సాధించిన విద్యార్థులకు ఆలిండియా కోటా సీట్ల భర్తీకి మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) మొదటి రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత రాష్ట్రాల వైద్య విశ్వవి ద్యాలయాలు మొదటి రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నాయి. ఈ ఏడాది దేశంలోని అన్ని రాష్ట్రాల కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి ఎంసీసీనే కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ప్రతిపాదించగా తెలంగాణ, తమిళనాడు సహా మరికొన్ని రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియ ఏకకాలంలో పూర్తిచేసే నేపథ్యంలోనే ఆలిండియా కోటా సీట్లకు ఎంసీసీ, కన్వీనర్ కోటా సీట్లకు రాష్ట్రాలు ఏకకాలంలో కౌన్సెలింగ్ నిర్వహించేలా ఎన్ఎంసీ ప్రతిపాదించగా రాష్ట్రాలు దీనికి అంగీకరించాయి. తాజాగా ఈ ప్రతిపాదనను ఎంసీసీ విరమించుకుంది.




# 'గృహలక్ష్మి' వచ్చేస్తోంది!

## సొంత జాగ ఉండి ఇల్లు కట్టుకొనే వారికి రూ.3 లక్షల సాయం

## ఆన్‌లైన్ ద్వారా స్వీకరణ.. కలెక్టర్ ఆధ్వర్యంలో పరిశీలన

## ఎమ్మెల్యే, జిల్లా మంత్రికీ దరఖాస్తులు ఇచ్చే అవకాశం

హైదరాబాద్ : తెలంగాణలో ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నది. ఇప్పటికే పేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తున్న కేసీఆర్ సర్కారు.. సొంత జాగాలు ఉండి ఇల్లు నిర్మించుకోవాలనే వారికి 'గృహలక్ష్మి' పథకం కింద రూ. 3 లక్షల ఆర్థికసాయం అందించనున్నది. ఈ పథకానికి త్వరలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్నది. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా లేదా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రికి నేరుగా సమర్పించవచ్చు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేస్తారు. ఇంచార్జి మంత్రి ఆధ్వర్యంలో ఇండ్లు మంజూరవుతాయి. గృహలక్ష్మి పథకం మార్గదర్శకాలను గత నెల ప్రభుత్వం విడుదల చేసింది. ఈ పథకానికి జిల్లాల్లో జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ పరిధిలో కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ (టీఎస్‌హెచ్‌సీఎల్) ఆధ్వర్యంలో, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహకారంతో ప్రత్యేకంగా పోర్టల్‌తోపాటు మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేశారు.

దరఖాస్తుల స్వీకరణ దగ్గరి నుంచి ఇండ్ల మంజూరు, బిల్లుల ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. నిర్దేశించిన సంఖ్యకు మించి దరఖాస్తులు వస్తే వెయిటింగ్ లిస్టు రూపొందించి అనంతరం మంజూరైన ఇండ్లలో వారికి ప్రాధాన్యం కల్పిస్తారు.

**మహిళ పేరిట ఇండ్ల మంజూరు :** గృహలక్ష్మి పథకం కింద మంజూరయ్యే ఇంటిని మహిళ పేరున ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్మాణం చేపట్టాక రూరల్‌లో సంబంధిత మండల అధికారులు, జీహెచ్ఎంసీలో అయితే సర్కిల్ అధికారులు నిర్మాణ పురోగతిని పర్యవేక్షిస్తారు. బేస్‌మెంట్, రూఫ్ లెవల్, కంప్లీషన్ మూడు దశల్లో ఫొటోలు తీసుకొని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. నిర్మాణ పురోగతిని బట్టి మూడు దశల్లో రూ. 1 లక్ష చొప్పున రూ. 3 లక్షలను లబ్ధిదారుడి ఖాతాకు బదిలీ చేస్తారు. ఈ నిధులపై పూర్తిగా సబ్సిడీ ఉంటుంది. అంటే ఇవి తిరిగి చెల్లించాల్సిన అవసరంలేదు. దీనికోసం ప్రత్యేక బ్యాంక్ ఖాతాను లబ్ధిదారులైన మహిళ పేర తెరుస్తారు. టీఎస్‌హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ రాష్ట్రస్థాయిలో పథకం అమలును పర్యవేక్షిస్తారు. పథకం అమలులో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే అవసరమైన మార్గదర్శకాలు జారీచేసే అధికారం మేనేజింగ్ డైరెక్టర్‌కు కల్పించారు.

**బడుగు, బలహీనవర్గాలకు 80 శాతం రిజర్వు :** ఈ ఏడాది బడ్జెట్‌లో గృహలక్ష్మి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 12,000 కోట్లు కేటాయించింది. ఒక్కో నియోజకవర్గంలో కనీసం 3000 ఇండ్ల చొప్పున, స్టేట్ రిజర్వు కోటా కింద 43,000 కలిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇష్టమొచ్చిన డిజైన్‌లో ఇల్లు నిర్మించుకొనే వీలు లబ్ధిదారులకు కల్పించారు. కనీసం రెండు గదులు, టాయ్‌లెట్ మాత్రం తప్పనిసరిగా నిర్మించుకోవాల్సి ఉంటుంది. లబ్ధిదారు లేక ఎవరైనా కుటుంబసభ్యుడు ఆహార భద్రత కార్డు, స్థానిక ఓటర్ ఐడీ, ఆధార్ కలిగి ఉండాలి. ప్రతి నియోజకవర్గంలో ఎస్సీలకు-20 శాతం, ఎస్టీలకు-10 శాతం, బీసీలు, మైనారిటీలకు 50 శాతానికి తగ్గకుండా ప్రాధాన్యం కల్పిస్తారు. ఇప్పటికే ఆర్‌సీసీ రూఫ్‌తో ఇల్లు (పక్కా ఇల్లు) ఉన్నవారు, జీవో-59తో లబ్ధిపొందినవారు ఈ పథకానికి అనర్హులు.

**ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 12,000 కోట్లు కేటాయింపు**
**ఒక్కో నియోజకవర్గంలో కనీసం 3000 ఇండ్ల నిర్మాణం**
**రాష్ట్ర రిజర్వు కోటా కింద 43,000 గృహాల మంజూరు**
**ఈ సంవత్సరంలో రాష్ట్రంలో 4 లక్షల ఇండ్లు కట్టడం లక్ష్యం**
**లక్ష చొప్పున 3 విడతల్లో లబ్ధిదారుడి ఖాతాకు నగదు జమ**
**జీవో 59తో లబ్ధిపొందినవారు ఈ పథకానికి అనర్హులు**

# తమిళనాడులో బీఆర్ఎస్ ఎంట్రీయా ?

హైదరాబాద్ : ఇంతకాలం మహారాష్ట్రలో జోరు చూపించిన కేసీయార్ ఇపుడు తమిళనాడుపై దృష్టిపెట్టారా ? అంటే అవుననే అంటున్నాయి బీఆర్ఎస్ వర్గాలు. తమిళనాడులో ఎంట్రీ ఇవ్వటానికి ప్రముఖ సినీనటుడు విజయ్ దళపతితో కేసీయార్ చేతులు కలిపినట్లు తెలుస్తోంది. పోయిన ఏడాది మేనెలలో విజయ్ హైదరాబాద్ వచ్చి ప్రగతిభవన్లో కేసీయార్ తో చాలాసేపు సమావేశమయ్యారు. ఆ సమావేశంలోనే తమిళనాడులోకి బీఆర్ఎస్ ఎంట్రీ ఇస్తే తన సహకారం ఉంటుందని విజయ్ హామీ ఇచ్చినట్లు ఇపుడు పార్టీవర్గాలు గుర్తుచేస్తున్నాయి. తొందరలోనే పార్లమెంటు ఎన్నికలు వస్తున్న నేపధ్యంలో హీరో విజయ్ తో కలిసి ఎన్నికలకు వెళితే ఎలాగుంటుందనే విషయాన్ని కేసీయార్ ఆలోచిస్తున్నారట. ఇదే విషయాన్ని విజయ్‌తో కూడా ఫోన్లో మాట్లాడినట్లు సమాచారం. దళపతికి కూడా పొలిటికల్ ఎంట్రీపై బాగా ఆసక్తి ఉన్నది. కొంతకాలంగా తాను నటించిన సినిమాల్లో పొలిటికల్ పంచ్ డైలాగులను అదేపనిగా ఉండేట్లుగా చూసుకుంటున్నారు. ప్రతి సినిమాలోను ఎక్కడో ఒకచోట పొలిటికల్ సన్నివేశాలు డైలాగులు ఉంటున్నాయి. ఇదంతా పక్కనపెట్టేస్తే తన పేరుతో అభిమానసంఘాలు సమాజసేవలో చాలా బిజీగా ఉంటున్నారు. వేలాది అభిమానసంఘాలున్న ఒకే ఒక్క హీరో బహుశా దళపతేనేమో. రజనీకాంత్ తో సమానంగా విశేషసంఖ్యలో అభిమానులున్నారు. వీళ్ళంతా విజయ్ ను రాజకీయాల్లోకి రావాలని ఎప్పటినుండో ఒత్తిడి చేస్తున్నారు. ఈమధ్యనే తమిళనాడులో జరిగిన లోకల్ బాడీ ఎన్నికల్లో విజయ్ పేరుతో పోటీచేసిన వారిలో సుమారు 128 మంది సర్పంచులుగా గెలవటం కలకలం రేగింది. అప్పటినుండి దళపతికి రాజకీయ వాసనలు బాగా ఎక్కువైపోతున్నాయి. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రత్యేకంగా చెన్నై వెళ్ళి విజయ్ తో సమావేశమయ్యారు. బీజేపీలో చేరమని లేదా కమలంపార్టీకి మద్దతుగా నిలవమని




అడిగారని తెలుస్తోంది. అయితే దళపతి మాత్రం రెండింటికి నో చెప్పారట. కారణాలు తెలీదు కానీ దళపతికి బీజేపీ అంటే ఎందుకో నచ్చలేదు. ఈ కామన్ పాయింటే విజయ్ ను కేసీయార్ ను దగ్గరకు చేసిందనే ప్రచారం అందరికీ తెలిసిందే.

మొత్తానికి రాబోయే లోక్ సభ ఎన్నికల్లో దళపతి సహకారంతో బీఆర్ఎస్ తమిళనాడులో ఎంట్రీ ఇవ్వాలని కేసీయార్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారట. మరి చివరకు ఏమి జరుగుతుందో చూడాలి.

## పీఎం పదవిపై కాంగ్రెస్‌కు ఆసక్తి లేదు : ఖర్గే

బెంగళూరు: అధికారంపైనా లేదా ప్రధానమంత్రి పదవిపైనా కాంగ్రెస్ పార్టీకి ఆసక్తి లేదని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెల్లడించారు. అధికారంలోకి రావడం తమ ఉద్దేశం కాదని.. కేవలం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని, సామాజిక న్యాయాన్ని పరిరక్షించడమే తమ ధ్యేయమన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భాజపాను ఓడించటమే లక్ష్యంగా బెంగళూరులో రెండోరోజు జరుగుతోన్న విపక్షాల సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రారంభోపన్యాసం చేశారు. 'తాము అధికారంలోకి రావడం ఈ సమావేశం ఉద్దేశం కాదు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని, సామాజిక న్యాయాన్ని పరిరక్షించడమే తమ ధ్యేయం. రాష్ట్ర స్థాయిలో తమలో కొన్ని విభేదాలున్న మాట వాస్తవమే. కానీ, అవి సిద్ధాంతరపరమైనవి కావని గుర్తించాలి. ఇవేవీ దేశం ఎదుర్కొంటున్న సమస్యల ముందు పెద్ద విషయాలు కావు' అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. తాము 26 పార్టీలకు చెందిన వారమన్న ఖర్గే.. 11 రాష్ట్రాల్లో తమ పార్టీలు అధికారంలో ఉన్నాయన్నారు. భాజపా సొంతగా 303 సీట్లు సాధించలేదన్నారు. ఓట్ల కోసం మిత్రపక్షాలతో కలిసి పనిచేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని భాజపా వదిలేస్తుందని ఆరోపించారు. ప్రస్తుతం భాజపా అధ్యక్షుడితోపాటు ఆయా రాష్ట్రాల కాషాయ నేతలు పాత మిత్రుల కోసం వివిధ రాష్ట్రాల్లో పరుగులు పెడుతున్నారని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భాజపాను ఓడించటమే ఏకైక లక్ష్యంగా వరుసగా రెండో రోజు విపక్షాలు సమావేశమయ్యాయి. బెంగళూరులోని తాజ్ వెస్ట్‌ఎండ్ హోటల్‌లో మంగళవారం ఉదయం ప్రతిపక్ష పార్టీల నేతలు భేటీ అయ్యారు. అయితే, దీనిపై స్పందించిన ప్రధాని మోదీ.. సొంత ప్రయోజనాల కోసం కొందరు ఏకమయ్యారని.. అది అవినీతిపరుల సదస్సు అని విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే.

## హైకోర్టులో కాంగ్రెస్ నేత పొంగులేటికి ఊరట

హైదరాబాద్: సొంత భూములపై ప్రభుత్వ సర్వేను సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి బెంచ్ విచారణ చేపట్టింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశించింది. ప్రస్తుతం ధర్మాసనం స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చింది. విచారణ ఆగస్టు 1కి కోర్టు వాయిదా వేసింది. ఎస్సార్ గార్డెన్‌లో




20 గుంటల ప్రభుత్వ భూమి ఉందని అధికారులు సర్వే చేశారు. ఎన్ఎస్‌పీ ల్యాండ్ ఉందని అధికారులు చెబుతున్నారు.

అయితే 13 సంవత్సరాల క్రితం గార్డెన్ నిర్మించామని పొంగులేటి పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ కక్ష సాధింపులో భాగంగానే భూములు సర్వే చేస్తున్నారని పొంగులేటి పిటిషన్‌లో పొందిపరిచారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది.




## విపక్షాల కూటమి పేరు I-N-D-I-A

బెంగళూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాజపాను ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయి. బెంగళూరు వేదికగా ప్రతిపక్ష నేతల భేటీ మంగళవారం కొనసాగుతోంది. ఈ సమావేశంలో విపక్షాల కూటమికి I-N-D-I-A అనే పేరును నిర్ణయించారు. ప్రతిపక్షాల ఫ్రంట్‌కు ఇకపై 'భారత జాతీయ అభివృద్ధి సమ్మిళిత కూటమి (I-N-D-I-A)'గా నామకరణం చేసినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధికారికంగా వెల్లడించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను ఓడించడమే లక్ష్యంగా కంకణం కట్టుకున్న విపక్షాలు రెండో విడతగా బెంగళూరులో భేటీ అయ్యాయి. సోమవారం సాయంత్రం ఈ భేటీ ప్రారంభమవ్వగా.. మంగళవారం కీలక అంశాలపై నేతలు చర్చలు చేపట్టారు. ఇందులో ఒకటైన 'కూటమి పేరు'పై విస్తృతంగా చర్చలు జరిగాయి. ఈ క్రమంలోనే ఐదారు పేర్లను నేతలు పరిశీలించారు. అయితే, కూటమి పేరులో ఫ్రంట్ అనే పదం ఉండకూడదని కొన్ని పార్టీలు సూచించినట్లు సమాచారం. దీంతో I-N-D-I-A (Indian National Developmental Inclusive Alliance) అనే పేరును ప్రతిపాదించగా.. అత్యధిక పార్టీల నేతలు ఏకీభవించాయి. ఈ పేరును కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిపాదించినట్లు ఖర్గే తెలిపారు. నేటి భేటీలో కనీస ఉమ్మడి కార్యక్రమ (సీఎంపీ) రూపకల్పనకు ఒక ఉప సంఘాన్ని నియమించడం, కూటమికి సంబంధించిన అంశాలపై సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునే వ్యవస్థను రూపొందించడం వంటివాటిపై చర్చించారు.

**పీఎం పదవిపై కాంగ్రెస్‌కు ఆసక్తి లేదు : ఖర్గే :** రెండో రోజు సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో పాటు ఎంలు మమతాబెనర్జీ (పశ్చిమ బెంగాల్-టీఎంసీ), నీతీశ్ కుమార్ (బిహార్-జేడీయూ), ఎం.కె.స్టాలిన్ (తమిళనాడు-డీఎంకే),అరవింద్ కేజ్రీవాల్ (దిల్లీ-ఆప్), భగవంత్ మాన్ (పంజాబ్-ఆప్), హేమంత్ సోరెన్ (ఝూర?ండ్-ఝూరండ్ ముక్తి మోర్చా), మాజీ ముఖ్యమంత్రులు- అఖిలేశ్ యాదవ్ (ఉత్తర్‌ప్రదేశ్), ఉద్ధవ్ ఠాక్రే (మహారాష్ట్ర), లాలూ ప్రసాద్ యాదవ్ (బిహార్), మెహబూబా ముఫ్తీ (జమ్మూ-కశ్మీర్), సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఎండీఎంకే నేత వైగో, జయంత్ చౌధరి (ఆర్ఎల్‌డీ) తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మోడీ చుట్టూ ముళ్లు..

### అయినా మౌనం వీడని విశ్వగురు!

ప్రధాని నరేంద్ర మోడీ.. విశ్వగురువుగా ప్రఖ్యాతి చెందిన విషయం తెలిసిందే. ముందు దేశాన్ని విశ్వగురు స్థానంలో నిలపాలని ప్రయత్నించి.. ఇప్పుడు తానే విశ్వగురుగా పేరు తెచ్చుకున్నారు. అయితే.. ఇప్పుడు ఆయన ఎంత కాదన్నా..ఔనన్నా.. కళ్లముందు కీలక సమస్యలు ముళ్ల మాదిరిగా గుచ్చుకుంటున్నాయి. వీటిలో గత 70 రోజులుగా అట్టుడుకుతున్న .. మరో మాటలో చెప్పాలంటే.. రావణ కాష్ఠంగా కాలుతున్న మణిపూర్ వివాదం ఉంది. ఇక్కడి గిరిజన తెగల మధ్య ఏర్పడ్డ రాజకీయ దుమారం ఇంతింతై.. అన్నట్టుగా రగులుతూనే ఉంది. అయితే.. మధ్యలో ఒకసారి కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోక్యం చేసుకుని సర్దిచెప్పినా.. బలగాల దుందుడుకుతో.. మళ్లీ రాజుకుంది. ఇప్పుడు ఇక్కడ జనాలు చాలా వరకు వలస పోయారు. రోడ్లు నిట్టూరుస్తూ.. వచ్చిపోయే సైనిక వాహనాలతో నిండిపోయాయి. మరోవైపు ఇంటర్నెట్ లేదు. టీవీలు లేవు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ కూడా కట్ చేసి రెండు మాసాలైంది. ఇక దీనికి తోడు.. ఇప్పుడు మరో వివాదం.. ఢిల్లీ నగరం వరదలతో మునిగిపోయింది. ఎటు చూసినా నీరే. చివరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి రాజ్భవన్ వరకు.. అంతా మునిగిపోయింది. ఇక ప్రతిష్టాత్మక ఎర్రకోట మహాత్మా గాంధీ సమాధి(రాజ్ఘాట్)లు కూడా.. వరద ముంపుల్లో కూరుకుపోయాయి. ప్రధాన కార్యాలయన్నీ వరద నీటి కారణంగా ముతబడ్డాయి. మరోవైపుపాఠశాలలకు సెలవులు ఇచ్చారు. అయితే.. ఇంత జరుగుతున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అటు మణిపూర్ విషయంపై కానీ.. ఇటు ఢిల్లీ వరదలపై కానీ.. ఎక్కడా స్పందించడం లేదు. చిత్రం ఏంటంటే భారత మీడియాకు ఇవన్నీ ఈ కోణంలో కనిపిస్తున్నాయో లేదో తెలియదు కానీ.. పాకిస్థాన్ సహా ప్రపంచ మీడియా పెద్ద పెద్ద ఫొటోలతో ఇటు మణిపూర్ అటు ఢిల్లీ అంశాలను చూపిస్తూ.. మోడీని ఏకేస్తుండడం గమనార్హం. నీరో చక్రవర్తి కథను పాకిస్థాన్ పత్రికలు తెరమీదికి తెచ్చాయి. కానీ ఎవరు ఏమనుకున్నా.. ఇప్పుడు మోడీకి వీటికన్నా.. ఉమ్మడి పౌరస్మృతి బిల్లు ఒక్కటే కనిపిస్తుండడం గమనార్హం..

# మహిళలకు అండగా.. అమ్మ మైటీ హెూప్స్



భీమారం : మహిళలు, యువతులు స్వయం ఉపాధి రంగంలో రాణించాలనే సంకల్పంతో వారికి వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణిస్తోంది అమ్మ మైటీ హెూప్స్ సంస్థ. ఒక్కో గ్రామానికి వెళ్లి అక్కడి మహిళలకు 5 నెలల పాటు శిక్షణ ఇస్తారు. 2016 మే నెలలో అమ్మ మైటీ హెూప్స్ సంస్థను హనుమకొండకు చెందిన అఖిల నాగుల ప్రారంభించారు. ప్రస్తుతం ఆమె అమెరికాలో స్థిరపడి తమ సిబ్బంది చేత ఈ సంస్థను నడిపిస్తున్నారు. సొంత ఖర్చుతో కంప్యూటర్లు, ఎంబ్రాయిడరీ, మగ్గం పరికరాలు, జూట్ సంచుల తయారీ, క్లాత్ సామగ్రి కొనుగోలు చేసి అందిస్తారు. 45 రోజుల నుంచి 5 నెలల వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. ఇప్పటి వరకు సుమారు 800 మంది లబ్ధి పొందారు. నాబార్డు, జన శిక్షణ సంస్థాన్, నెహ్రూ యువకేంద్రంతో కలిసి ఈ సంస్థ పలు కార్యక్రమాలనూ నిర్వహిస్తోంది.

సామాజిక సేవా కార్యక్రమాలు

అమ్మ మైటీ హెూప్స్ సంస్థ హసన్‌పర్తి మండలంలోని ఎల్లాపూర్, పెంబర్తి, సీతంపేట గ్రామాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసింది. గది అద్దెను, నిర్వాహకుడికి ప్రతినెల రూ.1000 నగదును అందజేస్తున్నారు. చింతగట్టు ఉన్నత పాఠశాలకు రూ.2 లక్షలతో ప్రహరీ, వాటర్ ట్యాంకును నిర్మించారు.

శిక్షణ కోర్సులు ఇవే..అమ్మ మైటీ హెూప్స్ సంస్థలో కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్ (5 నెలలు), టైలరింగ్ (3 నెలలు), మగ్గం వర్క్ (45 రోజులు), జూట్ బ్యాగ్స్ (3 నెలలు), క్లాత్ బ్యాగ్స్ (3 నెలలు), స్కిల్ డెవలప్‌మెంట్‌లో (3 నెలలు) నిష్ణాతులైన నిపుణులతో శిక్షణ ఇస్తున్నారు. అనంతరం మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు.హసన్‌పర్తి మండలంలోని గంటూరుపల్లి, సీతంపేట, చింతగట్టు, పెంబర్తి, ఎల్లాపూర్ తదితర గ్రామాల్లో పలువురు మహిళలు శిక్షణ పూర్తి చేసుకుని తమ ఇళ్లలోనే స్వయం ఉపాధిని పొందుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సుహాసిని, సంస్థ మేనేజర్ప్రస్తుతం హసన్‌పర్తి మండలం చింతగట్టు గ్రామంలో శిక్షణ ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలి.మహిళలు స్వయం ఉపాధి పొందాలిఅఖిల నాగుల, సంస్థ వ్యవస్థాపకురాలుమహిళలు స్వయం ఉపాధి పొంది జీవితంలో స్థిరపడాలనే మంచి లక్ష్యంతోనే ఈ సంస్థను ఏర్పాటు చేశాం. ఎంతమంది వచ్చినా శిక్షణను ఇచ్చేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉంది.

# అభివృద్ధి పేరుతో అక్రమ తరలింపు



వేములవాడ : అభివృద్ధి పనుల పేరుతో కొంత మంది గుత్తేదారులు ఇసుకను సొంత ప్రయోజనాలకు వినియోగించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అభివృద్ధి పనులకు ఇసుకకు అనుమతించిన అధికారులు అది ఏ మేరకు నిర్మాణాల వద్దకు తరలిస్తున్నారనేది పర్యవేక్షణ చేయకపోవడంతో గుత్తేదారులకు వరంగా మారింది. మూలవాగులో ఇసుక తీతకు అనుమతిస్తున్న అధికారులు దాని మీద పర్యవేక్షణ లేకపోవడంతో పెద్ద ఎత్తున గుత్తేదారులు సొంత నిర్మాణ పనులకు తరలిస్తున్నారు. పట్టణంలో పెద్ద ఎత్తున జరిగే నిర్మాణాలకు అక్రమంగా తీసుకెళ్తున్నారు. కొందరు గుత్తేదారులు ప్రభుత్వ పనులతో పాటు ప్రైవేటు వ్యక్తుల ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదే అదనుగా భారీగా పక్కదారి పట్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతి ఇస్తున్న అధికారులు ఇసుక సక్రమంగా ప్రభుత్వ పనుల వద్దకు చేరుతుందా? లేదా? అనేది పర్యవేక్షించడం లేదు. యాభై శాతం ట్రిప్పులు ప్రైవేటు భవనాలకు డంపు చేస్తున్నా పట్టించుకున్న నాథుడు లేడు. వేములవాడ పట్టణంలో ఇటీవల పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, మిషన్ భగీరథ, మన ఊరు –మనబడి, సమీకృత మార్కెట్లు, సుందరీకరణ వంటివి కొనసాగుతున్నాయి. వీటికి అవసరమైన ఇసుక తీసుకెళ్లడానికి వేములవాడ మూలవాగు నుంచి రెవెన్యూ అధికారులు అనుమతి ఇస్తున్నారు. కొందరు గుత్తేదారులు సొంత ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అనుమతి తక్కువ.. తరలింపు ఎక్కువ

వేములవాడ పట్టణంలో డిసెంబరులో 25 రోజుల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు 198 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకకు రెవెన్యూ అధికారులు వేములవాడ శివారులోని జయవరం వైపు మూలవాగు ప్రాంతంలో అనుమతి ఇచ్చారు. పట్టణంలో జరుగుతున్న పనులకు ఏ మేరకు ఇసుక అవసరమవుతుందనేది ఆయా శాఖల ఇంజినీరింగ్ అధికారుల అంచనా మేరకు రెవెన్యూ అధికారులు అనుమతిచ్చారు. వాగు వద్ద ట్రాక్టర్లకు అనుమతి పత్రాలిచ్చే రెవెన్యూ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరించడంతో అనుమతి పొందిన ట్రాక్టర్లతో పాటు అనుమతి లేని వాహనాల ద్వారా భారీగా తరలిస్తూ గుత్తేదారులు అక్రమ రవాణాకు తెర తీస్తున్నారు. మరోవైపు పట్టణంలో పెద్ద ఎత్తున ప్రైవేటు భవన నిర్మాణాలు కొనసాగుతున్నా ఏ ఒక్క దానికి కనీసం ట్రిప్పు ఇసుకకు కూడా అనుమతి పొందకపోవడం గమనార్హం. దీన్నిబట్టి ఏ స్థాయిలో పక్కదారి పడుతుందో ఊహించవచ్చు. రాత్రి వేళల్లోనూ కొంత మంది అక్రమార్కులు మూలవాగు నుంచి భారీగా డంపు చేస్తున్నారు. వర్షాకాలంలో పెద్ద ఎత్తున మూలవాగు ప్రవహించడంతో నాణ్యమైన ఇసుక నిల్వ అయింది. వాగులో నీటి ప్రవాహం తగ్గిపోవడంతోనే ఇసుకాసురులు అక్రమంగా తరలించడం మొదలు పెట్టారు. దీంతో రోజు రోజుకు వాగు ఖాళీ అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిఘా పెంచి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాంప్రభుత్వ అవసరాలకు ఇసుక తీతకు అనుమతిస్తున్నాం. అభివృద్ధి పనుల పేరుతో ఇసుకను పక్కదారి పట్టించే వారిపై చర్యలు తీసుకుంటాం. వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు చేపడుతున్న పనులకు ఏ మేరకు అవసరమవుతుందనేది అంచనా వేసిన తరవాత అందుకనుగుణంగా అనుమతిలిస్తున్నాం. రాజు, తహసీల్దార్, వేములవాడ

# సర్కారు బడుల్లో పీఎంశ్రీ

భువనగిరి : జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా సర్కారు బడుల్లో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే ఈ పథకం కింద లబ్ధి కోరుతూ జిల్లాలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ బృందం జనవరి 2023లో దరఖాస్తు చేసుకున్న పాఠశాలల్లో నెలకొన్న పరిస్థితులను పరిశీలించి ఎంపిక చేయనుంది. ఎంపికైన పాఠశాలలకు అయిదేళ్ల పాటు నిధులు మంజూరు కానున్నాయి.

ఎంపికైతే ప్రయోజనం ఇలా...జిల్లా వ్యాప్తంగా 712 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. పథకం ఎంపికకు పది అంశాలను కేంద్ర ప్రభుత్వం అర్హతలతో కూడిన అంశాలను నిర్దేశించింది. అందుకు అనుగుణంగా సదుపాయాలు అమల్లో ఉన్న 156 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో పీఎంశ్రీకి ఇప్పటికే దరఖాస్తు చేశారు. ఇందులో సాంకేతిక కారణాలతో 40 పాఠశాలలు ప్రాథమిక స్థాయి పరిశీలనలో తిరస్కరణకు గురయ్యాయి. ప్రస్తుతం ఎంపికైన 116 ప్రభుత్వ పాఠశాలల్లో 9,779 మంది బాలికలు, 10,560 బాలురు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు ఏటా రూ.46 లక్షలు మంజూరు చేయనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూర్చనున్నాయి. పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇవ్వనున్నారు.

సదుపాయాలు ఇలా...ఎంపికైన పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యం, విద్యాబోధన, వృత్తి విద్యపై దృష్టి పెడతారు. విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో రాణించేలా చర్యలు చేపడతారు. పాఠశాల పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతారు. కిచెన్ గార్డెన్, సోలార్ విద్యుత్తు సదుపాయాలు కల్పిస్తారు. రక్షిత నీటిని అందిస్తారు. ప్రయోగశాల, గ్రంథాలయం ఏర్పాటు చేస్తారు.

# విభజన కసరత్తు పూర్తి

నల్గొండ : ప్రగతికి కొలమానంగా నిలిచే రహదారులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అందుకు అవసరమైన యంత్రాంగాన్ని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే నీటిపారుదలశాఖ, పంచాయతీరాజ్ శాఖలను ప్రక్షాళన చేసిన ప్రభుత్వం ఆర్అండ్‌బీ శాఖ విభజనకు సైతం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు కసరత్తు పూర్తి చేసి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. ఉమ్మడి జిల్లా ప్రస్తుతం ఒక సర్కిల్ పరిధిలో ఉండగా..తాజా నిర్ణయంతో రెండు సర్కిళ్లుగా రూపాంతరం చెందనుంది. పునర్ వ్యవస్థీకరణ ప్రతిపాదనలు ప్రభుత్వం ఆమోదం పొంది ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

నాలుగు జిల్లాలు..రెండు సర్కిళ్లుగా

ప్రస్తుతం ఉమ్మడి నల్గొండ మొత్తంగా నల్గొండ సర్కిల్ కేంద్రంగా పనిచేస్తోంది. కొత్తగా సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి జిల్లాలతో పాటు పొరుగున ఉన్న జనగాం జిల్లాను కలిపి రెండు సర్కిళ్లుగా విభజన చేశారు. నల్గొండ సర్కిల్ పరిధిలో సూర్యాపేట, నల్గొండ



జిల్లాను చేర్చగా.. కొత్తగా యాదాద్రి కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న సర్కిల్‌లో భువనగిరి యాదాద్రి జిల్లాతో పాటు జనగాం జిల్లాను చేర్చారు. వాటి పరిధిలో ప్రతి నియోజకవర్గాన్ని ఒక సబ్ డివిజన్‌గా ఏర్పాటు చేశారు. అదే విధంగా నల్గొండ సర్కిల్ పరిధిలో 27 మంది, యాదాద్రి పరిధిలో 15 చొప్పున జేఈ పోస్టులు కేటాయించారు. కొత్త సర్కిల్ అమల్లోకి వస్తే ఉన్నతాధికారులపై పర్యవేక్షణ భారం, క్షేత్రస్థాయిలో పనిచే ఉద్యోగులపై పని భారం తగ్గనుంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిపాదనలు- నర్సింహ్మానాయక్,ఎస్ఈ ఉమ్మడి నల్గొండ జిల్లా ఆర్అండ్‌బీ శాఖ

రోడ్లను, ఆర్అండ్‌బీ శాఖను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సర్కిళ్ల విభజనలో భాగంగా ప్రతిపాదనలు పంపించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి సర్కిళ్లు, డివిజన్లు, సెక్షన్ల విభజన చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలో ఆమోదం పొంది జీవో వచ్చే అవకాశం ఉంది.

# అపసవ్య దిశలో ప్రయాణం.. ప్రమాదకరం

చిట్యాల : జాతీయరహదారిపై ప్రయాణం చిట్యాలలో ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే రహదారిని దాటడానికి నిర్మాణ సమయంలో సరైన సౌకర్యం కల్పించక ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల బస్‌స్టేషన్ కూడలిలో పోలీసులు ఏర్పాటుచేసిన బారికేడ్లతో సమస్య మరింతగా పెరిగింది. ఈ కూడలిలో రహదారిని దాటేందుకు స్థానికులతోపాటు ఉరుమడ్ల, నేరడ, ఎలికట్ట, తాళ్లవెల్లంల, వేంబాయి గ్రామాల నుంచి వచ్చే వాహనదారులు అపసవ్య దిశలో ప్రయాణిస్తున్నారు. ఇలా వీలు పడకపోతే.. సుమారు 4కి.మీ పైగా ప్రయాణించి పెద్దకాపర్తి సమీపంలో 'యూ' టర్న్ వద్దకు వెళ్లి తిరిగి చిట్యాలకు రావాల్సి ఉంటుంది. అంతదూరం వెళ్లలేక, ప్రమాదకరమని తెలిసినా.. అపసవ్యదిశలోనే ప్రయాణాలు సాగిస్తున్నారు. దీనిని నివారించడానికి ఇటీవల పోలీసులు ఈ కూడలి నుంచి హైదరాబాద్‌వైపు వెళ్లే మార్గం, సర్వీసు రోడ్డు జాతీయరహదారికి కలిసే ప్రదేశం వరకు బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఫలితంగా దాదాపు సగం జాతీయరహదారి నిరుపయోగంగా మారింది. దీనివల్ల అపసవ్య దిశగా వెళ్లే వాహనాల రాకపోకలు ఆగకపోగా జాతీయరహదారికి, సర్వీసుదారికి మధ్యన ఏర్పాటుచేసిన ఇనుపకంచె పక్కగా వెళ్లే వాహనాలు ప్రస్తుతం జాతీయరహదారి మధ్యనుంచి అపసవ్యదిశలో, అతి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నాయి. ఇక జాతీయరహదారిపై బస్టాపు పాయింట్ లేకున్నా, ఆర్టీసీ సిబ్బంది రహదారిపైనే బస్సులను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. బస్సుల కోసం ప్రయాణికులు జాతీయ రహదారిపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులను తీసుకెళ్లడానికి అక్కడే ఆగుతున్న ప్రైవేటు వాహనాలతోనూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం: కె.శివరాంరెడ్డి, సీఐ, నార్కట్‌పల్లి.

చిట్యాల బస్‌స్టేషన్ వద్ద ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన బారికేడ్ల వల్ల ఉత్పన్నమైన సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. పాదాచారులు ఈ కూడలి సమీపంలో ఉన్న ఫుట్ ఓవర్ వంతెనను వినియోగించుకోవాలి.

# పదండి ముందుకు... పదండి డోసుకు...

ఖమ్మం : కరోనా వైరస్ కోరలు చాచే ప్రమాదం ఉన్నట్లు హెచ్చరికలు జారీ అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. మూడు విడతల్లో వైరస్ కట్టడికి పకడ్బందీ వ్యూహంతో వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగించిన ప్రభుత్వం.. అదే క్రమంలో బూస్టర్ డోస్‌పై దృష్టి సారిస్తోంది. గత రెండు డోస్‌ల వ్యాక్సినేషన్‌లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు లక్ష్యానికి మించి ఫలితాలు సాధించాయి.

వైరస్ వ్యాప్తి ముప్పు పొంచిఉన్న తరుణంలో బూస్టర్ డోస్ పంపిణీని వారం రోజులుగా వైద్యారోగ్యశాఖ ముమ్మరం చేసింది. భద్రాద్రి జిల్లాలో ఇప్పటివరకు 69, ఖమ్మం జిల్లాలో 49 శాతం మందికి టీకా అందజేశారు. స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో రోజుకు సగటున 50 డోసుల చొప్పున వ్యాక్సినేషన్ కొనసాగుతోంది. కావాల్సినన్ని వాయిల్స్ (టీకా సీసాలు) దిగుమతి చేసేందుకు వైద్యాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రికాషన్ డోస్ పంపిణీలో భద్రాద్రి జిల్లా నాలుగో స్థానంలో నిలవడం విశేషం. ఈజిల్లాలో 8,30,756 మందికి 5,70,673 మంది వ్యాక్సిన్ వేసుకున్నారు. మరో 2 వేల డోసులు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

# ఆక్రమణలు తొలగించేందుకు సిద్ధం

వరంగల్ : హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో పలు దేవాలయాల స్థలాలు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన ఆక్రమణలు తొలగించేందుకు వరంగల్ ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సిద్ధమైంది. హనుమకొండ జిల్లాలోని పెద్దమ్మగడ్డ శివారు అక్షర కాలనీలో శ్రీరంగనాయక స్వామి దేవస్థానం(పెద్ద కోవెల) స్థలాల్లో వెలిసిన ఆక్రమణలు కూల్చేశారు. హనుమకొండ మండల రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 552, 807లో వెలిసిన అక్రమ నిర్మాణాలు, షెడ్లు తొలగించేశారు. ప్రైవేటు వ్యక్తులు, రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా.. పట్టించుకోకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు కూల్చివేతలు కొనసాగాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాల రెవెన్యూ శాఖాధికారులు లోకాయుక్త న్యాయస్థానానికి ఇచ్చిన నివేదిక ఆధారంగా హనుమకొండలో శ్రీ పద్మాక్షమ్మ, వీరపిచ్చ



మాంబ, శ్రీ సిద్దేశ్వర స్వామి, వరంగల్‌లో శ్రీమల్లికార్జున స్వామి(కుంటి భద్రయ్యగుడి), బాలానగర శ్రీ వేటంకటేశ్వరస్వామి దేవాలయాల్లో వెలిసిన ఆక్రమణలు తొలగించేందుకు సిద్ధమవుతున్నారు.

కమిషనర్ ఆదేశాలతో..: వరంగల్ ఉమ్మడి జిల్లాలో దేవాలయాల భూముల రక్షణ, ఆక్రమణల తొలగింపుపై దృష్టి సారించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. పది రోజుల క్రితం వరంగల్ నగరానికి విచ్చేసిన సందర్భంగా జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. నగర పరిధిలో కోట్లాది విలువ చేసే స్థలాల్లో ఆక్రమణలు వెలిశాయని, ఇలాంటి వాటిని గుర్తించి తొలగించాలని సూచించారు. ఇందులో భాగంగానే శ్రీరంగనాయకుల స్వామి ఆలయ స్థలాల్లో కట్టిన నిర్మాణాలు కూల్చేశారు.

# స్వావలంబనకు మిషన్ శక్తి

పెద్దపల్లి: మహిళల అభ్యున్నతికి మిషన్ శక్తి పథకం తోడ్పాటు కానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలో 'మహిళా సాధికారత హబ్'ను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అతివలకు భద్రత, సంరక్షణ, సాధికారత కల్పించడంతో పాటు స్వయం సమృద్ధితో స్వావలంబన సాధించడమే లక్ష్యంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ హబ్‌ను త్వరలో జిల్లా పాలనా ప్రాంగణం(కలెక్టరేట్)లోని సంక్షేమ శాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. అతివల భద్రత కోసం ఇప్పటికే షీ బృందాలు, సఖి కేంద్రాలు, మహిళా ఠాణాలు, ప్రభుత్వ శాఖల్లో వేధింపుల నివారణ కమిటీలు సేవలందిస్తున్నాయి. సాధికారత హబ్‌లో వ్యక్తిగత భద్రతతో పాటు ఆర్థికంగా, సామాజికంగా, వ్యక్తిగతంగా ఎలా ముందడుగు వేయాలో మహిళా విద్యావంతుల సమక్షంలో అవగాహన కల్పిస్తారు. లింగ వివక్ష లేకుండా సమాన ఉద్యోగాల కల్పన, హక్కుల సాధన, న్యాయపరమైన సమస్యలకు పరిష్కారాలు వంటి సేవలను ఉచితంగా అందిస్తారు. మిషన్ శక్తి కింద ఏర్పాటయ్యే ఈ హబ్‌లో 'సంబల్' పేరిట సఖి కేంద్రం, ఉమెన్ హెల్ప్‌లైన్, బేటీ బచావో–బేటీ పడావో, లింగ సమానత్వం, నారీ అదాలత్ వంటి ఉప విభాగాలు ఏర్పాటు చేయనున్నారు. 'సామర్థ్య' విభాగంలో ఉజ్వల హోమ్స్, స్వధార్ గృహాలు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్, ఉద్యోగినుల పిల్లల కోసం 'క్రీచ్' విభాగం, ప్రధానమంత్రి వయో వందన యోజన విభాగాలు ఏర్పాటు కానున్నాయి.

నియామక ప్రక్రియ చేపట్టాంప్రభుత్వం ప్రతి జిల్లాకో కేంద్రాన్ని కేటాయించింది. ఇందులో తాత్కాలిక నియామకాల కింద డిస్ట్రిక్ మిషన్ కో ఆర్డినేటర్ ఒకరు, జెండర్ స్పెషలిస్ట్ ఒకరు, ఫైనాన్షియల్ లిటరసీ కో ఆర్డినేటర్, అకౌంటెంట్, మల్టీ టాస్కింగ్ సర్వెంట్ వంటి ఖాళీల భర్తీకి ఇప్పటికే ప్రకటన జారీ చేశాం. త్వరలోనే అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో కేంద్రాన్ని ప్రారంభిస్తాం. మహిళలందరూ



ఈ హబ్‌కి వచ్చి సహాయం, న్యాయ సలహాలు ఉచితంగా పొందే వీలుంది. రౌఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

ఆర్థిక అక్షరాస్యత పెంపు

మహిళల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు అమలు చేస్తున్నాయి. వీటిపై మారుమూల గ్రామాలతో పాటు పట్టణ, నగర ప్రాంతాల్లోనూ మహిళలకు కనీస అవగాహన ఉండటం లేదు. పురుషులతో సమానంగా ఆర్థిక అక్షరాస్యత లేకపోవడం వివక్ష పెరిగేందుకు ఆస్కారమవుతోంది.

ఇలాంటి సమస్యలకు పరిష్కారంగా చదువుకున్న వారితో పాటు నిరక్షరాస్యులకు సైతం ఈ హబ్ అన్ని రకాలుగా చేయూతనందిస్తోంది. పని ప్రదేశాల్లో వేధింపులు, స్థిర, చరాస్తులల్లో వారసత్వ హక్కులు సాధించేందుకు ప్రత్యేకంగా నైపుణ్యం పొందిన మహిళా ప్రతినిధులతో అవగాహన కల్పించడంతో పాటు ఉచితంగా సలహాలు అందిస్తారు. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేసేందుకు ఫైనాన్షియల్ లిటరసీ కో ఆర్డినేటర్ పదవిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబన సాధనకు వీరు పూర్తి సహకారం అందిస్తారు. బ్యాంకు రుణాల సద్వినియోగం, పొదుపు పథకాలతో పాటు ఆర్థిక సుస్థిరత సాధించేలా శిక్షణ ఇస్తారు.

జెండర్ స్పెషలిస్టులు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను ఎదుర్కోవడమే కాకుండా సంబంధిత వ్యక్తులను చట్టబద్ధంగా ఎలా ఎదుర్కోవాలి? లింగ సమానత్వం, వివక్షను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై సూచనలు, సలహాలు అందించనున్నారు.

# పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం



రామన్నపేట : గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు (కారోబార్లు, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, పారిశుద్ధ్య కార్మికులు, ట్రాక్టర్ డ్రైవర్లు) సమ్మె బాట పట్టడంతో పల్లెల్లో పారిశుద్ధ్యం పనులు పడకేశాయి. న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని ఈ నెల 6 నుంచి సమ్మె చేస్తున్నారు. జిల్లాలో అత్యధిక సభ్యులు కలిగిన సీఐటీయూ, పంచాయతీ కారోబార్ల, ఉద్యోగ, సిబ్బంది ఐకాస సంఘాల్లోని కార్మికులు సమ్మెలో పాల్గొంటుండగా, భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం (భారాసకావి) కార్మికులు దూరంగా ఉండి విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. చెత్త సేకరణ లేకపోవడంతో రోడ్లపై చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. వానాకాలం కావడంతో.. రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని పలువురు చెబుతున్నారు. గ్రామల్లో పారిశుద్ధ్య నిర్వహణపై పరిశీలన చేపట్టింది.

మురుగు పారడం లేదు

ళ్ల ముందు వ్యర్థ పదార్థాలు కుప్పలుగా పడి ఉన్నాయి. కాల్వల్లో మురుగు పారడం లేదు. కార్యదర్శులు, సర్పంచులు చొరవ తీసుకొని గ్రామాలకు తాగునీటని తాత్కాలిక సిబ్బందితో సరఫరా చేస్తున్నారు. మూడు రోజుల క్రితం దేశాయిపల్లిలో చెత్తను తరలించే ట్రాక్టరు అదుపు తప్పి కందకంలోకి దూసుకుపోయింది. తాత్కాలికంగా వచ్చిన డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రభుత్వం, పంచాయతీ ఆదుకునే పరిస్థితి లేదు.

బయటివారితో పనులు

నర్సంపేట మండలం గురిజాలలో 1100 గృహాలుండగా 10 మంది పంచాయతీ సిబ్బంది పని చేస్తున్నారు. వీరంతా సమ్మెలో ఉండటంతో ఎక్కడి పనుల అక్కడే నిలిచాయి. మురుగు సమస్య ఉండటంతో.. బయటి వ్యక్తులతో పనులు చేయిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజమౌళి తెలిపారు. మండల అధికారుల విజ్ఞప్తి మేరకు నల్లాల మీద పని చేసే కార్మికులు రోజూ ఉదయం నీటిని వదిలిన తర్వాత దీక్ష శిబిరానికి వెళ్తున్నారు.

పిచ్చిమొక్కలు పెరిగి

మురుగు కాల్వలను శుభ్రం చేయడంలేదు. దుర్వాసన వస్తోంది. కాల్వల పక్కన పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ఖానాపురంలో మాత్రమే ఆఫ్‌లైన్ సిబ్బందితో చెత్త తరలిస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లతో పనులు చేయిస్తున్నారు. అయోధ్యనగర్, కొడ్తిమాటుతండ, భద్రుతండ, రాగంపేట, మంగళవారిపేట, బుధరావుపేటలో కొందరు సమ్మెలో పాల్గొనడం లేదు. వర్షాకాలం కావడంతో దోమల తీవ్రత పెరుగుతోంది.

చెత్త సేకరణలో వార్డు సభ్యులు

మండల కేంద్రంలో సర్పంచి, కార్యదర్శి ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేయగా, సమ్మె చేస్తున్న కార్మికులు అడ్డుకున్నారు. అలంఖాపేట గ్రామంలో వార్డు సభ్యుడు రవి స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ చెత్త సేకరిస్తున్నారు.

కంపు కొడుతున్న గ్రామాలు

ఇళ్లలో, రోడ్లపై చెత్త పేరుకుపోతోంది. పాపయ్యపేట గ్రామంలోని మురుగు కాల్వలో చెత్తాచెదారంతో పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి. పలు వీధుల్లో చెత్త పేరుకుపోయింది. మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి.

సమ్మె కొనసాగిస్తాం.. – జన్ను శ్రీనివాస్, జీపీ కారోబార్ల, ఉద్యోగ, కార్మికుల ఐకాస జిల్లా బాధ్యుడు

ఏళ్లుగా అరకొర వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నాం. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని చెప్పినా పభుత్వం వాటి పరిష్కారానికి ముందుకు రావడం లేదు. ఉద్యోగ భద్రత, రూ.20వేల కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, తదితర డిమాండ్లు తీర్చాలి. లేదంటే సమ్మెను కొనసాగిస్తాం.

ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాం– కల్పన, జిల్లా పంచాయతీ అధికారి, వరంగల్

సమ్మెతో గ్రామీణులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాం. దినసరి వేతన కార్మికులను నియమించి పనులు చేయిస్తున్నాం. పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని పంచాయతీల్లో కార్మికులందరూ సమ్మెలోకి వెళ్లలేదు కొందరు విధుల్లో ఉన్నారు.

# పార్కింగ్ ఉండదు.. జరిమానా తప్పదు



కరీంనగర్ : 'లావణ్య అనే మహిళ కడుపునొప్పితో బాధపడుతుండడంతో ఊటూరు నుంచి కరీంనగర్‌లోని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి వాహనంలో తీసుకొచ్చారు. ఆమెను దింపిన తర్వాత ముందున్న సెక్యూరిటీ సిబ్బంది వాహనాన్ని ఇక్కడి నుంచి తీసుకెళ్లమన్నారు. పార్కింగ్ లేదని దబాయించడంతో రోడ్డు పక్కన నిలిపారు. ఇంతలోనే ట్రాఫిక్ పోలీసులు అటు వచ్చి ఫొటో తీశారు. కాసేపటికి జరిమానా చెల్లించాలని చరవాణికి సందేశం వచ్చింది.'

ఇదీ కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోంల పరిస్థితి. చికిత్స కోసం వచ్చే వారికి అడ్డగోలు అయ్యే వైద్యం ఖర్చుతోపాటు పార్కింగ్ చలాన మోత కూడా తప్పడం లేదు. వాణిజ్య భవనాలన్నింటికి సంబంధిత యజమాని పార్కింగ్ సౌకర్యం కల్పించకపోవడంతో రోడ్లపై పార్కింగ్ చేయాల్సి వస్తోంది. భవన అనుమతుల సమయంలోగానీ, నిత్య పర్యవేక్షణలోగానీ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

రోగ నిర్ధారణ కేంద్రాల పరిస్థితి మరీ అధ్వానం రోగ నిర్ధారణ కేంద్రాల వద్ద అయితే పార్కింగ్ స్థలమే ఉండటం లేదు. సిటీస్కాన్, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ స్కాన్‌తోపాటు రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించే కేంద్రాలు అధికంగా అద్దె భవనాల్లోనే ఉన్నాయి. పరీక్షలకు సొంత వాహనాలు, అంబులెన్స్‌లు వంటి వాటిల్లో తీసుకెళ్తే పార్కింగ్ స్థలమే ఉండటం లేదు. గత్యంతరం లేక రహదారులపై నిలపాల్సి వస్తోంద్ని.

ఇవీ నిబంధనలు..

ఆసుపత్రి భవన నిర్మాణానికి ముందే పార్కింగ్ స్థలం చూపిస్తేనే పుర, నగరపాలికలు అనుమతి ఇవ్వాలి.

ఆసుపత్రి ఏర్పాటు చేసేందుకు జిల్లా వైద్య రోగ్యశాఖ ఆమోద ముద్ర వేయాలి.

పార్కింగ్, ఇతర సౌకర్యాలు కల్పిస్తే తప్ప అనుమతి ఇవ్వకూడదు.

దర్జాగా ఉల్లంఘనలు

ఇన్ పేషెంట్లు చూసే చాలా ఆసుపత్రులు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. నర్సింగ్‌హోంలు మాత్రం 50 శాతం అద్దె భవనాలు, మిగతా 50 శాతం సొంత భవనాలు ఉన్నాయి.

అద్దె భవనాల ఆసుపత్రులకు మాత్రం నగర పాలక, ఆర్అండ్‌బీ రహదారులే పార్కింగ్ స్థలాలుగా మారాయి.

సొంత భవనాలు ఉన్న వారికి సెల్లార్లు చూపిస్తుండగా వాటిలో పార్కింగ్ చేసేందుకు అవకాశం కల్పించడం లేదు. సిబ్బంది వాహనాలు, అంబులెన్స్‌లకు ఈ స్థలం సరిపోతుంది.

రూ.కోట్లు ఖర్చు చేసినా నిరుపయోగం

నగరంలో రహదారులను వెడల్పు చేసి ఆధునికీకరించారు. పాదచారులకు ఇబ్బందులు లేకుండా నడకదారి నిర్మించి లైటింగ్ ఏర్పాటు చేశారు. రూ.కోట్లు ఖర్చు చేసినా అవి పార్కింగ్ స్థలాలుగా మారాయని నగరవాసులు ఆగ్రహిస్తున్నారు. ఈ వైపు నిత్యం రద్దీగా ఉండటం, అంబులెన్స్‌లు, ప్రైవేటు వాహనాలు నిలిపి రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారని మండిపడుతున్నారు. అసలైన కారకులను వదిలేసి సాధారణ ప్రజలకు ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించడం ఏమిటని అధికారులను ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఏం చేస్తున్నట్లు? ప్రైవేటు ఆసుపత్రులు, ఇతర వాణిజ్య భవనాలకు వచ్చే వాహనాలకు కచ్చితంగా పార్కింగ్ స్థలం చూపించాల్సి ఉంటుంది. సెల్లార్లు ఉన్న చోట మూసి ఉంచిన తెరిపించడం లేదు. కొందరైతే ఇతర అవసరాలకు వాడుతున్నారు. అత్యవసర పరిస్థితిలో ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్న ప్రజల వాహనాలు ఎక్కడ నిలుపుకోవాలనే విషయాన్ని మాత్రం స్పష్టంగా తెలపడం లేదు. నగరపాలక సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, ట్రాఫిక్ పోలీసు అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

పార్కింగ్ వసతి చూపాల్సిందే

ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే వాహనదారులకు పార్కింగ్ సౌకర్యం చూపించాలి. ఈ విషయంలో తనిఖీలు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

డాక్టర్ లలితాదేవి, డీఎంహెచ్‌వో, కరీంనగర్

# 29 శాతం మందికే రుణమాఫీ

పెద్దపల్లి : పంట రుణాల మాఫీ కోసం రైతులకు ఏళ్ల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. మాఫీ అవుతుందన్న ఆశతో రుణాలు క్రమబద్ధీకరించుకోవడం లేదు. ఫలితంగా వడ్డీ భారం పెరుగుతోంది. 2018 డిసెంబరు 11 నాటికి రూ.లక్ష లోపు తీసుకున్న పంట రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని భారాస(అప్పటి తెరాస) ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికల్లో గెలిచి రెండోసారి అధికారంలోకి రావడంతో అమలవుతుందని రైతులు భావించారు. రెండున్నరేళ్ల తర్వాత విడతల వారీగా రూ.50 వేల లోపు రుణాలను మాఫీ చేసి రైతుల ఖాతాల్లో తిరిగి జమ చేశారు. వీరిలోనూ కొందరికి జమ కాలేదు. పంట రుణ మాఫీ విషయమై ప్రతి బడ్జెట్ సమావేశంలో సభ్యులు ప్రస్తావిస్తున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభమై నెల దాటినా ఎలాంటి స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు మార్గదర్శకాలు వస్తేనే మాఫీ జరుగుతుందని బ్యాంకర్లు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 87,880 మందిజిల్లాలో 87,880 మంది రైతులకు రూ.150.68 కోట్ల రుణ మాఫీ ఖరారైంది. ఇందులో ముందుగా రూ.25 వేల లోపు వారికి మాఫీ చేశారు. జిల్లాలో 8,614 మందికి రూ.13.04 కోట్లు ఖాతాల్లో జమ అయ్యాయి. రెండో విడతలో రూ.50 వేల లోపు రుణాలు తీసుకున్న వారు 17,052 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ఇప్పటివరకు రూ.35 వేలలోపు అప్పు ఉన్న వారికి మాత్రమే వర్తించింది. మిగిలిన వారికి జమ కాలేదు. రూ.50 వేల వరకు రుణ మాఫీ చేశామని అధికారులు చెబుతున్నా, వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పంట రుణం మాఫీ అవుతుందని చాలా మంది రైతులు నిరీక్షిస్తున్నారు.

# చెరకు రవాణా ఛార్జీలు చేదు

కరీంనగర్ : లేఆఫ్ కారణంగా ముత్యంపేట చక్కెర పరిశ్రమను మూసివేయడంతో జిల్లాలో చెరకు పంట సాగుచేస్తున్న రైతులకు ఏటా ఇబ్బందులు తప్పడంలేదు. సాగు ఖర్చులకు తోడు రవాణా ఛార్జీలు రైతులకు భారంగా మారుతున్నాయి. రాష్ట్రంలో వరికి ప్రత్యామ్నాయంగా చెరకును పండించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రభుత్వ విధానాలతో రైతులు నష్టాలపాలవుతున్నారు. పంటను సాగుచేసినా ఇతర జిల్లాలోని పరిశ్రమలకు తరలించడంలో రవాణా ఛార్జీల భారం ఏటా పెరుగుతుండటంతో రైతులు నిరాసక్తత కనబరుస్తున్నారు.

టన్నుకు రూ.550 వరకు భారం

రాష్ట్రంలో దక్కన్ చక్కెర పరిశ్రమలు ముత్యంపేట, నిజామాబాద్ జిల్లా బోధన్, మెదక్ జిల్లా ముంబోజిపల్లిలో ఉన్నాయి. 2015లో నష్టాల నేపంతో పరిశ్రమలను మూసివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. దీంతో ఈ ప్రాంతంలో రైతులు సాగుచేసిన చెరకు పంటను నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి గాయత్రీ షుగర్స్‌కు తరలించడం రైతులకు భారంగా మారుతుంది. రైతులు



ఎకరం భూమిలో చెరకు పంటను సాగుచేస్తే సరాసరి దిగుబడి 40 మెట్రిక్ టన్నుల వరకు వస్తుంది. పరిశ్రమకు చెరకును తరలించడానికి లారీకి రానుపోను మెట్రిక్ టన్నుకు రూ.500 వరకు వెచ్చించాల్సి వస్తుంది. దీంతో ఏడాది సాగుచేసిన పంటకు మిగిలేది తక్కువేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు గతంలో ఉన్న రాయితీలు, పురుగు మందలను ప్రైవేటు పరిశ్రమ అందించకపోవడం ఇబ్బందిగా మారుతున్నాయి. పరిశ్రమలు తెరిపిస్తేనే ప్రయోజనం– కల్లెం మహిపాల్‌రెడ్డి, రైతు, మల్లాపూర్

లేఆఫ్ కారణంగా మూసివేసిన పరిశ్రమలను తెరిపించడంతో పాటు గతంలో మాదిరిగా రాయితీలను అందిస్తే రైతులకు ఉపశమనం కలుగుతుంది. నష్టాల నేపంతో మూసివేసిన పరిశ్రమలను తెరిపించి అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేస్తే కూలీలు, కార్మికులకు ఉపాధితో పాటు ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ప్రభుత్వమే భరించాలి–నారాయణరెడ్డి, చెరకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడుఈ ప్రాంత రైతులు పండించిన చెరకు పంటను కామారెడ్డిలోని గాయత్రీ షుగర్స్‌కు తరలించడంతో రైతులపై అదనపు భారం పడుతుంది. ఒక్కో టన్నుకు దాదాపు రూ.500 ఖర్చులను భరించాల్సి వస్తుంది. మార్కెట్‌లో ఎరువులు, ఇంధన ధరలను పెంచుతున్నట్లు పంట మద్దతు ధరలను పెంచకపోవడంతో ఏటా నష్టాలు వస్తున్నాయి. కనీస మద్దతు ధరను రూ.4500 చెల్లించి ఆదుకోవాలి.

# మినీ స్టేడియం.. నిరుపయోగం

కోరుట్ల: ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నైపుణ్యం గల క్రీడాకారులను వెలికి తీసేందుకు ఏటా మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రీడా పోటీలను నిర్వహిస్తుంది. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులకు అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేస్తుంది. ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేసేందుకు ప్రోత్సాహం అందిస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో సాధన చేసేందుకు సరైన క్రీడా మైదానాలు, కోర్టులను సమకూర్చడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. కోరుట్ల మినీ స్టేడియంలో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఇండోర్ స్టేడియంలో పరికరాలు సమకూర్చక పోవడంతో ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారింది. ప్రభుత్వం పట్టణాల్లో వార్డుకొక, గ్రామీణ ప్రాంతాల్లో ఊరుకోక క్రీడా ప్రాంగణాలను నామమాత్రంగా ఏర్పాటు చేయించినా వాటిలో శిక్షణ ఇచ్చే వారు లేకపోవడంతో ఉపయోగంలో లేకుండా పోతున్నాయి.

కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 2018లో జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో రూ1.69 కోట్లను వెచ్చించి ఇండోర్ స్టేడియం నిర్మించారు. సుమారు రెండేళ్ల కిందట ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దీనిని ప్రారంభించారు. మినీ స్టేడియంలో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ ఆడేందుకు కోర్టులు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఎలాంటి కోర్టులు, పరికరాలు, ఇతర సౌకర్యాలు కల్పించకుండా ఏళ్ల తరబడి నిర్లక్ష్యంగా వదిలేశారు. పేరుకే కోరుట్ల జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో మినీ స్టేడియం ఉన్నా అది క్రీడాకారులకు అందుబాటులోకి రాకపోవడంతో ఎందుకు పనికి రాకుండా నిరుపయోగంగా మారింది. స్టేడియంకు రక్షణ లేకపోవడంతో భవనం చుట్టూ ఉన్న కిటికీల అద్దాలు, ముఖద్వారం ఫర్నీచర్‌ను ఆకతాయిలు ధ్వంసం చేశారు. క్రీడాకారులకు అందుబాటులోకి రాకముందే రంగు కోల్పోతూ, స్టేడియం దెబ్బతిని కళావిహీనంగా మారింది.

రాష్ట్ర స్థాయిలో గుర్తింపు

కోరుట్ల రాష్ట్ర, అంతరాష్ట్ర క్రీడాకారులకు పెట్టింది పేరు. ఇక్కడి నుంచి వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయిలో ఎన్నో పతకాలు సాధించారు. ఇందులో చాలామంది ఉత్తమ క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎన్నికై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులను నాణ్యమైన క్రీడాకారులుగా తయారు చేస్తున్నారు. సుమారు లక్ష జనాభా గల కోరుట్ల పట్టణంలోనున్న ఏకైక మైదానం జూనియర్ కళాశాల గ్రౌండ్. ఇందులో నిత్యం క్రీడాకారులు సాధన చేసేందుకు ఎలాంటి కోర్టులు, సౌకర్యాలు లేవు. బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మించినా అది దెబ్బతినడంతోపాటు సాధన చేయించేందుకు కోచ్‌లు అందుబాటులో లేరు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, ఇతర ఆటలు సాధన చేసేందుకు కోర్టులను ఏర్పాటు చేయకుండా జిల్లా యువజన, క్రీడలశాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతో వందల మంది క్రీడాకారులు నిత్యం మైదానానికి వచ్చి ఖాళీ స్థలాల్లోనే సాధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సీనియర్ క్రీడాకారులు వారి సొంత ఖర్చులతో తాత్కాలికంగా కోర్టులు ఏర్పాటు చేసి విద్యార్థులకు వివిధ రకాల క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. క్రీడాకారులకు వసతులు కల్పించాలని జిల్లా క్రీడలశాఖ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం సీనియర్ క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మరోసారి..

కొత్తగూడెం : పుస్తకాలుంటేనే బోధన సజావుగా సాగుతుంది. కళాశాలల ప్రారంభం రోజున విద్యార్థుల చేతుల్లో వాటిని ఉంచితే ఆ ఆనందమే వేరు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల విద్యార్థులకు ఏటా ఉచితంగా ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలను అందజేస్తుంది. ఈ విద్యాసంవత్సరంలో పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రక్రియ ఊసేలేదు. కళాశాలలు ప్రారంభమై 45 రోజులు కావొస్తున్నా విద్యార్థులు వేచిచూసే పరిస్థితులు నెలకొన్నాయి. ముద్రణ లో జాప్యం వల్లే సమస్య నెలకొందని అధికారులు చెబుతున్నారు.

ఉభయ జిల్లాల్లో..

ఖమ్మం జిల్లాలో 14 కేజీబీవీల్లో 1,569 మంది, 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు



4,723 మంది విద్యార్థులు చదువుతున్నారు. భద్రాద్రి జిల్లాలో 14 కేజీబీవీల్లో 925 మంది, 14 ప్రభుత్వ కళాశాలల్లో 5,100 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. 2023 జూన్ 1న కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. నూతన పుస్తకాలు విద్యార్థులకు అందించకుండానే బోధన సాగుతోంది. గతేడాది మూడు నెలలు ఆలస్యంగా పుస్తకాలను అధికారులు పంపిణీ చేశారు. ఈసారీ తీరు మారేలా కనిపించటం లేదు. తాజాగా కళాశాలల్లో పదోతరగతి సప్లిమెంటరీ విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ సాగుతోంది. పాతపుస్తకాలను అరకొరగా సర్దుబాటు చేశారు.

పాఠ్యపుస్తకాల పంపిణీపై ఉన్నతాధికారులకు నివేదించాం. పాతపుస్తకాలను విద్యార్థులకు సర్దుబాటు చేసి బోధన సాగిస్తున్నాం. కొత్తగా ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పుస్తకాల ముద్రణలో జాప్యం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైంది. సులోచనారాణి, డీఐఈఓ, భద్రాద్రి

# మొగ్గతొడుగుతున్న అవినీతి అంట్లు

ఖమ్మం : ఉద్యాన నర్సరీల్లో అవినీతి అంటుకుంటోంది. తల్లి మొక్కలు లేకుండానే ఏటా లక్షలాది అంట్లు తయారవుతోన్నాయి. రైతుల అవసరాన్ని కొందరు నర్సరీ యజమానులు అవకాశంగా తీసుకుని తాము ఇచ్చిన మొక్కే నాణ్యమైన అంటూ అంటగడుతు న్నారు. మొక్కలు తీసుకెళ్లాక ఐదారేళ్లకు కానీ మొక్క ఏ రకమో అసలు రూపం కానరాదు. ఏటా లక్షల సంఖ్యలో మామిడి అంట్లు అశ్వారావు పేట, దమ్మపేట, ములకలపల్లి ప్రాంతాల నుంచి రాష్ట్రంలోనే కాక, ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి అవుతున్నాయి. ఒక్కో మామిడి అంటు మొక్కను రూ.40 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు. ఏటా ఈ మండలాల నుంచి సుమారు కోటికిపైగా మామిడి అంట్లు విక్రయిస్తుంటారు. సాధారణంగా మామిడి అంట్లు తయారు కావాలంటే టెంకెలు తెచ్చి నారు పోయాలి. ఐదారు నెలలు పెరిగాక ఎంపిక చేసిన బంగినపల్లి, రసాలు, దశేరి, మల్లిక, తోతాపురి, ఇలా రకమేదైనా వాటి తల్లి మొక్కల నుంచి సయాన్(అంటుకట్టే పుల్ల) తీసుకొచ్చి అంట్లు కట్టాలి. అలా అంటు కట్టిన మొక్క కనీసం ఆరు నెలలు నర్సరీలో పెరగాలి. మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తున్న మొక్కలు విక్రయించాలి. ఇక్కడ తయారయ్యే అంటుకట్టే పుల్లలు(సయాన్) ఏ తోట నుంచి తెస్తున్నారో ఎవరికీ తెలియదు. ఆఖరికి నర్సరీ యజమానికి కూడా తెలియని దుస్థితి. వేరే నర్సరీ నుంచి అంట్లు తీసుకురావడం ఇక్కడ వాటిని వేరే బ్యాగుల్లో ఉంచి నాలుగు నెలలు పెంచి ఇతర రాష్ట్రాలకు విక్రయించడం ఏటా జరిగే తంతు.

తల్లి చెట్లు కరవే..

నర్సరీలు వందల్లో ఉన్నా తల్లి చెట్లున్న నర్సరీలు వేళ్లపై లెక్కించొచ్చు. ప్రభుత్వ నర్సరీల్లో మినహా ప్రైవేటు నర్సరీల్లో ఎక్కడా తల్లి చెట్లు కానరావు. అంట్లు కొనుగోలుచేసి తోట వేసిన ఐదేళ్ల తరువాత తాము మోసపోయామని తెలిసినా తోట తీసేయలేరు. సక్రమంగా



కాపు కాయదు. ఆరేళ్ల కిందట ఛత్తీస్‌గఢ్ నుంచి పలువురు రైతులు ఈ ప్రాంతంలో ఓ నర్సరీ నుంచి మామిడి అంట్లు తీసుకెళ్లి మామిడి తోట పెంచారు. ఐదేళ్లకు తీసుకెళ్లిన రకం కాకుండా ఒకటి, కాయలు కాసింది మరో రకం కావడంతో అక్కడి నుంచి కొందరు రైతులు గత ఏడాది ఇక్కడకు వచ్చి పంచాయతీ పెట్టి నష్టపరిహారాన్ని డిమాండ్ చేశారు. చివరకు ఏంతోకొంత పరిహారాన్ని తీసుకెళ్లారు. ఇలా ఎంతోమంది రైతులది ఇదే దుస్థితి. కొందరు నర్సరీ యజమానులు అవకతవకలకు పాల్పడుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

నర్సరీ నిర్వహణ చట్టం ఇలా..

నర్సరీ నిర్వాహకులు తప్పనిసరిగా తల్లి చెట్లు ఉండాలని నర్సరీ నిర్వహణ చట్టం చెబుతోంది. ఏ తోట నుంచి సయాన్ సేకరించారో మొక్కల బెడ్ల వద్ద వివరాలు ఉంచాలి. అవేమీ ఇక్కడ కానరావు. అసలు నర్సరీ నిర్వహణ చట్టం ఉందని కూడా చాలా మందికి తెలియ దు. ఇకనైనా ఈ అవకతవకలకు అడ్డుకట్ట వేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ అంశంపై డీహెచ్ఎస్ జి.మరియన్నతో మాట్లాడుతూ బాధిత రైతులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

# ప్రభుత్వ సాయం పంపిణీకి సిద్ధం



ఖమ్మం : బీసీ కుల వృత్తుల వారికి దన్నుగా నిలిచేందుకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. తొలి విడతలో నియోజకవర్గానికి 300 మంది చొప్పున ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 3వేల మంది లబ్ధిదారులకు ఆర్థిక సాయమందనుంది. శనివారం నుంచి ఈనెల 25 వరకు పంపిణీ ప్రక్రియ జరగనుంది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. నియోజక వర్గాల వారీగా లబ్ధిదారుల జాబితాలను ఇదివరకే రూపొందించారు. లబ్ధిదారులకు సంబంధిత ఎమ్మెల్యేలు చెక్కులు అందజేయనున్నారు.

బేరాలకు దిగిన దళారులు

ఆర్థిక సాయానికి బీసీ కులవృత్తుల వారి నుంచి ఆన్‌లైన్‌లో ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయిలో ఎంపీడీఓలు దరఖాస్తులపై విచారణ జరిపి అర్హుల జాబితాను జిల్లా అధికారులకు అందజేశారు. తరువాత ప్రభుత్వానికి జాబితాను కలెక్టర్ పంపించారు. పరిశీలన అనంతరం లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో పొందుపరిచింది. ఇదే అదనుగా దరఖాస్తుదారులను సంప్రదించి ఆర్థిక సాయమందిస్తామంటూ దళారులు బేరాలకు దిగారు. కొన్ని నియోజకవర్గాల్లో రూ.10వేల నుంచి రూ.20వేల వసూలు చేశారు. ఈ విషయాన్ని గ్రహించిన అధికారులు పైరవీలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని ప్రకటించారు. వరుస క్రమంలోనే లబ్ధిదారులకు చెక్కులు అందజే స్తామని తెలిపారు.

కులవృత్తులకు పునరుజ్జీవం

బీసీ కులవృత్తులకు పునరుజ్జీవం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 100 శాతం గ్రాంటు కింద ఒక్కో లబ్ధిదారుకు రూ.లక్ష అందిస్తుంది. ఈ నిధులతో చేతి, కులవృత్తుల వారు తమకు అవసరమైన సామగ్రి, పరికరాలు కొనుగోలు చేసేందుకు వీలు కల్పించింది. సర్కారు సాయం పక్కదారి పట్టకుండా బీసీ సంక్షేమ శాఖ అధికారులు చొరవ చూపనున్నారు. ఖమ్మం జిల్లాలో 26,451 మంది దరఖాస్తు చేసుకుంటే 13,820 మందిని అర్హులుగా గుర్తించారు. 2,663 మందిని అనర్హులుగా తేల్చారు. మిగిలిన దరఖాస్తులపై విచారణ జరుపుతు న్నారు. భద్రాద్రి జిల్లాలో 13,675 మందిని అర్హులుగా తేల్చారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సంక్షేమ దినోత్సవం సందర్భ ంగా నియోజకవర్గానికి పది మంది లబ్ధిదారులకు ప్రభుత్వ సాయం అందజేశారు. మిగిలిన అర్హులకు చెక్కులు పంపిణీ చేయనున్నారు.

బీసీ కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తుంది. లబ్ధిదారులకు చెక్కులు పంపిణీలో పారదర్శకంగా వ్యవహరిస్తాం. దళారులను నమ్మి మోసపోవద్దు. జి.జ్యోతి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, ఖమ్మం

# పెట్రోల్ బంకుల్లో సేవలకు తూట్లు



ఖమ్మం : పెట్రోల్ బంకుల నిర్వాహకులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. వినియోగదారుల చట్టం ప్రకారం సేవలు అందించడం లేదు. చాలా బంకుల్లో సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నా రనే ఆరోపణలున్నాయి. పెట్రోల్, డీజిల్ తక్కువగా వస్తోందని, నీ ళ్లు కలుపుతున్నారని తరచూ కొంతమంది వినియోగదారులు ఆందోళనలు చేయడం సర్వసాధారణంగా మారింది. ఆ సమయంలో హడావుడి చేస్తున్న అధికారులు తర్వాత పట్టించుకున్న దాఖలాలు లేవు. నిబంధనల మేరకు అందాల్సిన సేవల కోసం వినియోగదారులు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

‘గాలి’కి వదిలేశారు..

పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల వాహనాల టైర్లలో గాలి చెక్ చేసి అవసరమైతే ఉచితంగా నింపాలి. ప్రతి బంక్‌లో గాలి నింపే యంత్రాలు ఏర్పాటు చేసి, సేవలు అందించాలి. కానీ చాలావాటిలో యంత్రాలు పని చేయడం లేదని అక్కడున్న సిబ్బంది చెబుతున్నారు. వర్కర్ లేడని, బయటకెళ్లాడని, తర్వాత రావాలని సూచిస్తుంటారు. ఖమ్మం నగరంలోని బంకుల్లోకి ప్రతిరోజూ వేలాదిగా ద్విచక్ర వాహనా లు, కార్లు, ఆటోలు పెట్రోల్, డీజిల్ కోసం వస్తుంటాయి. చోదకులు తమ వాహనాల టైర్లలో గాలి పెట్టించుకుందామని చూస్తే చాలా బంకుల్లో యంత్రం వద్ద ఎవరూ కనిపించడం లేదు.

మరుగుదొడ్లు ఉన్నా అనుమతించరు...

ప్రతి బంకుల్లో మరుగుదొడ్లు నిర్మించి వినియోగదారులకు అందుబా టులో ఉంచాలి. పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేసినా.. చేయకున్నా అటుగా వెళ్లే వ్యక్తులు అత్యవసరంగా బంకుల్లో మరుగుదొడ్లు వినియో గించుకోవచ్చు. అందరికీ కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలి. కానీ చాలావాటిలో నిర్వాహకులు మరుగుదొడ్లు ఉపయోగించు కునేందుకు అనుమతించటం లేదని ఆరోపణలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో లోపలికి రానివ్వరు. బంకుల్లో తాగునీటి సదుపాయం కనిపించడం లేదు.

బంకులు 173

పెట్రోల్ అమ్మకాలు 5.25 లక్షల లీటర్లు

డీజిల్ విక్రయాలు 13.50 లక్షల లీటర్లు

ఉమ్మడి జిల్లాలో మరో 122 కొత్త బంకుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశాయి.

బంకుల్లో కచ్చితంగా వాహనాల టైర్లలో గాలి నింపే యంత్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఆదేశించాయి. తాజాగా నైట్రోజన్ నింపాలని సూచించాయి. మరుగుదొడ్లు వినియోగి ంచుకుంటే అభ్యంతరం చెప్పడానికి వీల్లేదు. పెట్రోల్ బంకుల్లో సేవల్లో లోపాలు, అభ్యంతరాలు ఉంటే తహసీల్దారు లేదా పౌరసరఫరాల సంస్థ, చమురు సంస్థల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. నాగబత్తిన రవి, పెట్రోల్ బంకుల యజమానుల సంఘం ప్రతినిధి, ఖమ్మం

# రామయ్య భూములకు రక్షణ!



భద్రాచలం : దేవాదాయ శాఖ ఆస్తుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల ఆర్డినెన్స్ తీసుకొచ్చారు. ఈ ఆర్డినెన్స్ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి మాన్యానికి రక్షణగా ఉంటుందని తెలంగాణ దేవాదాయ శాఖ భావిస్తోంది. ఇప్పటికే స్వామి వారి భూముల రక్షణకు పక్కా ప్రణాళిక అమలుచేయాలని రామాలయం అధికారులు నిర్ణయించారు. సర్వే నంబర్ల ఆధారంగా డిజిటలైజేషన్‌కు పూనుకోనున్నారు. ఈ కోవెలకు ప్రత్యేక వెబ్‌సైట్ ఉండటంతో భూముల వివరాలను ఇందులో పొందుపరిచి ఎలాంటి చిక్కులు రాకుండా చూడాలని భావిస్తున్నారు. ప్రభుత్వ గెజిట్‌లోనూ నిక్షిప్తపరచనున్నారు.

ఆలయ భూముల్లోని కట్టడాలను తొలగిస్తారా..?

భద్రాచలం రాములవారికి అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో అధిక విస్తీర్ణంలో భూమి ఉంది. అక్కడ దాదాపు 890 ఎకరాల్లో 700 ఎకరాలు ఆక్రమణకు గురైంది. మొదట్లో డ్యామేజీ ఛార్జీల కింద భూములకు రైతులు శిస్తులు చెల్లించగా ఈమధ్య మానేశారు. ఈ భూములన్నీ తమవేనన్నది అక్కడి వారి వాదన. ఈక్రమంలో పదుల సంఖ్యలో నూతన శాశ్వత కట్టడాలు ఏర్పడ్డాయి. దీనిపై అంతర్రాష్ట్ర స్థాయి ఉద్యమాలు సాగాయి. రామాలయానికి అనుకూలంగా ఏపీ హైకోర్టు తీర్పునిచ్చింది. పురుషోత్తపట్నం వాసులు సైతం పోరాటం సాగిస్తున్నారు. గతంలో పనిచేసిన ఈఓలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దలను కలిసి సమస్యను వివరించారు. ఈఓగా రమాదేవి బాధ్యతలు స్వీకరించాక భూముల అంశానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇంతకుముందు ఒకసారి ఏపీ దేవాదాయ శాఖ మంత్రి సత్యనారాయణకు ఈ అంశంపై విన్నవించారు. తాజాగా మూడు రోజుల క్రితం మరోదఫా కలిసి అన్ని వివరాలను అందించి సహకరించాలని కోరారు. పురుషోత్తపట్నంలో ఇటీవల నిర్మించిన భవనాలను తొలగిస్తారా లేదా అన్న చర్చ సాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో భద్రాద్రి రామాలయానికి చెందిన భూములు 1,347.27 ఎకరాలుండగా 1,087.34 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు సమాచారం.

అభివృద్ధి పనులపై దృష్టి సారించరూ..

యాదాద్రి, వేములవాడ ఆలయాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో ప్రత్యేక అథారిటీలను ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయాభివృద్ధికి రూ.వందల కోట్లతో బృహత్తర ప్రణాళిక రూపొందించటంతో అక్కడా అథారిటీని ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. ప్రభుత్వం నిధులివ్వకపోతే ధర్మకర్తల మండళ్లు చొరవ చూపి ఆయా ఆలయాలను తీర్చిదిద్దుతున్నాయి. భద్రాచలంలో దశాబ్దం నుంచి ధర్మకర్తలు లేరు. ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు పర్యాయాలు ఇక్కడికి వచ్చి రూ.150 కోట్లు ప్రకటించినా ఈ నిధులను రాబట్టేందుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపటం లేదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. అంజన్నకు ఆరాధ్య దైవమైన రామయ్యపై దేవాదాయ శాఖ దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

# అడవులను నరికితే కఠిన చర్యలు: ఎఫ్‌డీఓ

భద్రాచలం : పోడు పేరుతో అడవులను నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ డివిజనల్ అధికారి (ఎఫ్‌డీఓ) అప్పయ్య అన్నారు. రామవరం రేంజి పరిధిలోని తిప్పనపల్లి బీట్‌లోని ప్లాంటేషన్‌లో కొందరు మొక్కలను నరికిన ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం చంద్రుగొండలోని అటవీశాఖ రేంజి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కొత్తగా పోడు కొడితే పట్టాలొస్తాయని దళారులు అమాయక ప్రజలను రెచ్చగొడుతున్నారని, వారి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. అలాంటి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు దక్కకుండా చేస్తామన్నారు. వారి జాబితా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైతే బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోడు భూముల నిబంధనల



ప్రకారం సర్వే జరిపి ప్రభుత్వం అర్హులైన వారికి పోడు పట్టాలు జారీ చేసిందన్నారు. రామవరం రేంజి పరిధిలోని తిప్పనపల్లి బీట్‌లో నాలుగెకరాల్లో ప్లాంటేషన్‌ను ధ్వంసం చేశారని, నిందితులను గుర్తించి కేసులు నమోదు చేయిస్తామన్నారు. చంద్రుగొండ రేంజి అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.

నిందితులపై కేసు.. తిప్పనపల్లి బీట్‌లోని కంపార్ట్‌మెంట్ 30లోని ప్లాంటేషన్‌లో 2,800 మొక్కలను తిప్పనపల్లి గ్రామానికి చెందిన కొంద రు నరికేశారని, వీటి విలువ రూ.4.26లక్షలు ఉంటుందని ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు. బాబురావు, హన్మంతు, భద్రు, ఉప్పలయ్య, లాలు, రాంబాబు, భజ్యా, ఉప్పలయ్యతో పాటు మరికొందరు నిందితు లపై బీట్ అధికారి సుమన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు.

# వ్యాయామ చికిత్స.. రోగులకు భరోసా

ఖమ్మం : ఆధునిక జీవన విధానంలో మెడ, కండరాల నొప్పులు, ఆర్థరైటిస్ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ప్రమాదాల్లో గాయాలపాలై కోలుకున్నవారు క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణలో వ్యాయామాలు చేయాల్సి వస్తుంది. పక్షవాతం, కీళ్లనొప్పులు, స్పాండిలైటిస్ వంటి ఆరోగ్య సమస్యలున్న వారికి ఫిజియోథెరపీ తప్పనిసరి. ప్రైవేటుగా చూపించుకుంటే రూ.వేలల్లో డబ్బులు ఖర్చవుతా యి. ఇటువంటి వారికోసం ఖమ్మం సర్వజనాసుపత్రిలో ‘ఎల్డర్లీ కేర్ యూనిట్’ ఏర్పాటు చేశారు. ఉచితంగా సేవలు అందిస్తున్నారు. జాతీయ ఆరోగ్య ప్రణాళికలో భాగంగా నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ పెరుగుదలను నివారించడానికి వ్యాయామ చికిత్సను అందులో చేర్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో ఆరోగ్య మిషన్ కింద ఫిజియోథెరపీ సేవలను ప్రవేశపెట్టారు. ఈ కేంద్రంలో 20 మంది ఔట్ పేషెంట్ సేవలు పొందుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి రిఫర్ చేసే బాధితులతో పాటు సర్వజనాసుపత్రికి వచ్చే వారికి



ఇక్కడ సేవలు అందిస్తున్నారు.

ఎవరికీ అవసరం.. శరీరంలోని వివిధ విభాగాలకు చికిత్స చేయడానికి ఫిజియోథెరపీని ఉపయోగించవచ్చు. ఆయా భాగాల్లో నొప్పులను నివారిస్తూ జీవన నాణ్యతను మెరుగుపరచడానికి దోహదపడుతుంది. క్రీడలు, ప్రమాద గాయాలు, కంజరాటల డిజార్డర్స్, సైకలాజికల్ సమస్యలు, ఎదుగుదల లోపం, ఆర్థరైటిస్, మెడ, శరీర నొప్పులు, సర్వైకల్ స్పాండిలైటిస్, లంబార్ స్పాండిలైటిస్, మోకాళ్ల, కీళ్ల నొప్పులు, పక్షవాతం, బైపాస్ సర్జరీ, పార్కిన్సన్ డిసీజ్ బాధితులకు ఫిజియోథెరఫీ సేవలు తప్పనిసరి. పద్దెనిమిదేళ్ల పైబడిన వారందరికీ ఇక్కడ చికిత్స చేసేందుకు ఏర్పాట్లు ఉన్నాయి.

చికిత్సలు ఇలా.. ఫిజియోథెరపీ విభాగంలో బాధితులకు మాన్యువల్ థెరపీ, ఎలక్ట్రోథెరపీ, ఎక్సర్‌సైజ్ థెరపీ విధానంలో చికిత్స అందిస్తారు. వాటికి సంబంధించిన పరికరాలు ఏర్పాటు చేశారు. ఎన్‌హెచ్ఎం కింద నియమించిన ఫిజియోథెరపిస్టు రోగులకు అందుబాటులో ఉ ంటూ సేవలందిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి– అస్మా కౌసర్, ఫిజియెథెరపిస్ట్(ఎంపీటీ) సర్వజన ఆస్పత్రిలో ఉచిత సేవలు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన బాధితులు సద్వినియోగం చేసుకోవాలి. శరీర నొప్పులకు ఉపశమనం కలుగుతుంది. అవసరమైన అన్ని సదుపాయాలు ఉ న్నాయి. సమస్యలపై సందేహాలు కూడా నివృత్తి చేసుకోవచ్చు.

# స్వచ్ఛ సమరం.. పల్లెల గమనం

కొత్తగూడెం : పట్టణాలు, నగరాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయి. ర్యాంకుల్లో ఉత్తమ స్థానాల్లో నిలిచేవాటికి ప్రోత్సాహక నిధులు మంజూరు చేస్తున్నాయి. ప్రస్తుతం పట్టణాలు, నగరాలకు అమలు చేస్తున్న ‘స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2022–23’ ర్యాంకులను ఈ ఏడాది నుంచి గ్రామ పంచాయతీలకూ వర్తింపజేస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రస్థాయికి ఎంపిక చేసిన పంచాయతీలను నేటి నుంచి 25వ తేదీ వరకు కేంద్ర బృందం పరిశీలించనుంది. అనంతరం రాష్ట్రస్థాయి ర్యాంకులు విడుదలకా నున్నాయి.

గ్రామాల ఎంపిక..మరుగుదొడ్లు, సెగ్రిగేషన్ షెడ్లు, మురుగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, ఇంకుడు గుంతల నిర్మాణం, వాల్ పెయింటింగ్స్, తడి, పొడిచెత్త సేకరణ, ఎరువుల తయారీపై పోర్టల్‌లో పేర్కొన్న వివరాల ఆధారంగా 15 పంచాయతీలను రాష్ట్రస్థాయి పరిశీలనకు ఎంపిక చేశారు. వీటిల్లో 2,000, 2–5 వేలు, 5 వేలకు పైగా జనాభా ఉన్న గ్రామాలను ఐదు చొప్పున మొత్తం 15 గ్రామాలున్నాయి.

# పది విద్యార్థులకు 'డిజిటల్ స్టడీ'..

సిద్దిపేట : చేతిలో ఇమిడిపోయే చరవాణి ప్రతి ఒక్కరి జీవితంలో భాగంగా మారుతోంది. ఆన్‌లైన్ వేదికగా అనేక పనులు ఇంటి నుంచే చక్కబెట్టుకునే పరిస్థితి నెలకొంది. కరోనా పరిస్థితుల్లో విద్యార్థులు ఆన్‌లైన్ చదువులకు అలవాటుపడ్డారు. ఈ తరుణంలో పదో తరగతి విద్యార్థులు పాఠశాలలో ప్రత్యేక తరగతులు వింటూనే.. ఇంటి వద్ద చదువుకునేలా రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు 'డిజిటల్ స్టడీ' కార్యక్రమాన్ని జిల్లాలో ప్రవేశపెట్టనున్నారు. ప్రతి విద్యార్థిని డిజిటల్ సహకారంతో పరీక్షలకు సన్నద్ధం చేయనున్నారు. చరవాణి/సాంకేతిక మాధ్యమం వేదికగా.. తరగతులు నిర్వహించనున్నారు. ఇప్పటికే సాంకేతిక నిపుణులతో సమీక్షించిన మంత్రి.. త్వరలోనే ప్రధానోపాధ్యాయుల సమీక్షలో సంబంధిత కార్యాచరణ ప్రకటించనున్నారు. విద్యార్థుల మేధస్సుకు పదునుపెట్టేలా ఈ వినూత్న కార్యక్రమం దోహదం చేయనుంది.

స్ఫూర్తి కొనసాగించేలా..

ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో అన్ని యాజమాన్యాల్లో మొత్తంగా 14,186 మంది చదువుతున్నారు. ప్రభుత్వ బడుల్లో దాదాపు 11 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. మరో రెండు రోజుల్లో సిలబస్ పూర్తి కానుంది. ఇప్పటికే ప్రత్యేక తరగతులు అదనంగా కొనసాగుతున్నాయి. జనవరి నుంచి పునఃశ్చరణ తరగతులు, సాధన పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా గత విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. స్ఫూర్తిని కొనసాగించేలా మంత్రి.. మూడు నెలలుగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. అదే పంథాలో వారిలో మేధస్సుకు పదును పెట్టనున్నారు. ఈక్రమంలో 'డిజిటల్ స్టడీ'ని ప్రవేశపెట్టనున్నారు. పరీక్షలకు సన్నద్ధత, సందేహాల నివృత్తి, సాధన, ఇతరత్రా అంశాలు ముడిపడి ఉంటాయి.

సందేశం..

విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశిస్తూ మంత్రి హరీశ్‌రావు లేఖలు పంపించనున్నారు. ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, అమ్మానాన్నల ఆశయాలను నెరవేర్చాలని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. లేఖలో ఇలా ప్రస్తావించారు. 'మీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు మీ శ్రమ వెలకట్టలేనిది. వారికి నాణ్యమైన విద్య అందితేనే భవిష్యత్తు బాగుంటుంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం పాఠశాల విద్య బలోపేతానికి అనేక చర్యలు తీసుకున్న విషయం మీకు మరోసారి గుర్తుచేస్తున్నాం. విద్యార్థుల జీవితంలో పదో తరగతి కీలకమైంది. భవితకు పునాదులు వేసే వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. ఇప్పటికే పాఠ్యాంశాల బోధన పూర్తయింది. రివిజన్ చేస్తూ వెనుకబడిన విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. మీ పిల్లలకు అర్థంకాని సబ్జెక్టుని ఉపాధ్యాయులను సంప్రదించి నివృత్తి చేసుకోగలరు. ఈ స్థితిలో మీ పిల్లల భవిష్యత్తు కోసం మీరు కొన్ని చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. ముఖ్యంగా టీవీలకు మీరు దూరంగా ఉంటూ పిల్లలు చదువుకునేలా ప్రోత్సహించండి. సెల్‌ఫోన్లు బంద్ చేయండి. పరీక్షలు పూర్తయ్యే వరకు విందులు, వినోదాలకు దూరంగా ఉంచండి. ఈ మూడు నెలల కష్టపడి తలవంచి చదివితే జీవితాంతం తలెత్తుకొని బతికేలా మీ పిల్లల భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశిస్తూ..' అని ముగించారు. ఆయా ఉత్తరాలను విద్యార్థుల తల్లిదండ్రులకు చేరవేయనున్నారు. త్వరలోనే ఈ ప్రక్రియ మొదలు కానుంది.

# అభయమిచ్చి... మెరుగైన సేవలందించి!

సంగారెడ్డి: మొగుడంపల్లి మండలం దిడ్డి గ్రామానికి చెందిన లతకు 2020లో తొలికాన్పు అయ్యింది. ఆ సమయంలో ప్రసవానికి తొలుత జహీరాబాద్ ప్రాంతీయ ఆస్పత్రికి వచ్చారు. ఇక్కడ కష్టమని చెప్పిన వైద్యులు హైదరాబాద్‌కు వెళ్లాలని సూచించారు. దీంతో ఆమె రాజధానిలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ఇప్పుడు ఆమె రెండోసారి గర్భం దాల్చారు. స్థానికంగా ఉన్న కొత్తూరు(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేరు నమోదు చేయించుకున్నారు. ప్రసవానికి ప్రైవేటుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 25న మంత్రి హరీశ్‌రావు జిల్లాలోని పలువురు గర్భిణులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేరుగా లతతో మాట్లాడిన మంత్రి.. ఈ విషయాలన్నీ తెలుసుకున్నారు. తప్పకుండా ప్రభుత్వ ఆస్పత్రికే రావాలని ఆమెకు సూచించారు. అధికారులు ఆ మరుసటి రోజే లత ఇంటికి వెళ్లారు. రిపోర్టులన్నీ పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇప్పుడు మెరుగైన సేవలందుతున్నాయని ఆమెకు వివరించారు. ఈనెల 26న పరీక్షలన్నీ చేశారు. ఉమ్మనీరు తక్కువగా ఉండటంతో సిజేరియన్ చేయాలన్నారు. దీంతో ఆమె ఈనెల 27న జహీరాబాద్ ప్రాంతీయ ఆస్పత్రిలో చేరారు. అదే రోజు ఆమె పండంటి



బాబుకు జన్మనిచ్చారు. వైద్యులు, సిబ్బంది ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని మెరుగైన సేవలందించారని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

దవాఖానాలను అన్ని రకాలుగా తీర్చిదిద్దుతున్నాం

మంత్రి హరీశ్‌రావు

అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తెస్తున్నాం. మెరుగైన సేవలతో పాటు ప్రసవానంతరం ప్రత్యేక వాహనంలో వారిని ఇంటి వద్దకు తీసుకెళుతున్నాం. కేసీఆర్ కిట్ ఇస్తున్నాం. ప్రైవేటుకు వెళితే ఆర్థిక భారం తప్పదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలను వినియోగించుకోవాలని కోరుతున్నాం. ఏవైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తాం. సంగారెడ్డి జిల్లాలో 86శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అవుతుండటం వైద్యశాఖ పనితీరుకు నిదర్శనం.

# నిధుల వ్యయం పక్కాగా..



మెదక్ : సర్కారు బడుల నిర్వహణకు ప్రతి ఏటా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. పాఠశాలలో పిల్లల సంఖ్యను బట్టి కేటాయింపులు జరుగుతున్నాయి. గతంలో పాఠశాల హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ ఛైర్మన్ సంయుక్త ఖాతాలో నిధులు జమయ్యేవి. ఎస్‌ఎంసీ తీర్మానాల మేరకు ఖర్చు చేసే విధానం అమల్లో ఉండేది. ఈ ఏడాది ప్రభుత్వం నిధుల ఖర్చుకు సంబంధించి కొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది.

అవగాహన కల్పించి..నిధుల వినియోగంలో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం కొత్తగా 'పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం' (పీఎఫ్‌ఎంఎస్)ను అమల్లోకి తీసుకొచ్చింది. దీని ద్వారా నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. విద్యాశాఖ, ఆర్థిక గణాంక అధికారులు కొత్త విధానం అమలుపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. బడుల నిర్వహణకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఇటీవల ప్రభుత్వం జిల్లాలోని 910 ప్రభుత్వ పాఠశాలలకు రూ.1.51 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జూన్ నుంచి ఇప్పటి వరకు పాఠశాలల్లో వివిధ అవసరాలకు హెచ్‌ఎంలు పెట్టిన ఖర్చులకు సంబంధించిన మొత్తాన్ని ఇందులో నుంచి తీసుకునేందుకు అవకాశం కల్పించారు.

మార్గదర్శకాలు..

పాఠశాల నిధుల వినియోగానికి ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు విడుదల చేసింది. ఏదైనా వస్తువు కొనుగోలు చేసినా లేదంటే నగదు చెల్లించినా వారి పేరు, ఖాతా నంబరు, చేసిన ఖర్చుల వివరాలు, సేవా బిల్లును పీఎఫ్‌ఎంఎస్‌లో నమోదు చేయాల్సిందే. దీన్ని పరిశీలించాక నిర్వహణ నిధుల నుంచి ఆన్‌లైన్‌లో వారి ఖాతాకు ఆ మొత్తం జమవుతుంది. పాత పద్ధతిలో డబ్బు చెల్లించి బిల్లు తీసుకుని ఆడిట్ సమయంలో వాటిని అందజేసేవారు. కొందరు తప్పుడు బిల్లులు సమర్పించి దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలతో ప్రభుత్వం దీన్ని అమల్లోకి తీసుకొచ్చారు.

అన్ని వివరాలు..నిధుల వినియోగానికి తీర్మానాలు చేసి ప్రింట్, పేమెంట్, అడ్వైస్ పద్ధతిలో ఖర్చుకు సంబంధించిన చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. నగదు ఇచ్చిన వారి వద్ద అవు తీసుకున్నట్లు నమోదు చేయాలి. వివరాలు క్యాష్ పుస్తకంలో ఎవరి వద్ద నుంచి ఎంతెంత అప్పు తీసుకున్నారన్నది పొందుపర్చాలి. స్టేషనరీతో పాటు ఇతర సామగ్రి కొనుగోలుకు సంబంధించినవి స్టాక్ రిజిస్టర్‌లో రాయలి.

లావాదేవీలు సులభంగా..రమేష్‌బాబు, డీఈవో

పీఎఫ్‌ఎంఎస్ విధానం ద్వారా పాఠశాల నిధుల వినియోగంలో పారదర్శకతకు అవకాశం ఉంటుంది. కొత్త విధానంలో లావాదేవీలు సులభంగా చేయవచ్చు. జిల్లాలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఎస్‌ఎంసీలకు శిక్షణ ఇచ్చాం. ఇప్పటికే దీని వినియోగం ప్రారంభమైంది.

# కొల్లగొడుతూ.. గండికొడుతూ..!



మెదక్ : జిల్లాలో మట్టి దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. మూడు ట్రాక్టర్లు.. ఆరు టిప్పర్లతో వ్యాపారం జోరుగా సాగుతోంది. నీటి వనరులు, గుట్టలను కొల్లగొడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఫిర్యాదు చేస్తే తప్ప అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర రాజధానికి జిల్లా సమీపంలో ఉండటం.. ప్రధాన గ్రామాల వెంట జాతీయ రహదారులు ఉండటంతో స్థిరాస్తి వ్యాపారం జోరందుకుంది. సాగు భూములు కొనుగోలు చేసి నాలా పూర్తయ్యాక వాటిని వెంచర్లు చేసి విక్రయిస్తున్నారు. జిల్లా మీదుగా వెళ్లే జాతీయ రహదారులు 44, 765(డి) వెంట అధికంగా ఇలా ఏర్పాటవుతున్నాయి. దీనికితోడు మెదక్, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్, చేగుంట పట్టణాలు, మాసాయిపేట, మనోహరాబాద్, కౌడిపల్లి, కొల్చారం, పెద్దశంకరంపేట, అల్లాదుర్గం మండల కేంద్రాల్లోనూ వెంచర్లు వెలిశాయి.

అనుమతులు తీసుకోకుండానే...

గనులు, ఇసుక, మట్టి తవ్వకాలకు అనుమతి తప్పనిసరి. వ్యాపారులు ప్రభుత్వానికి రాయల్టీ (పన్ను) సైతం చెల్లించాలి. కానీ ఎక్కడా వ్యాపారులు అనుమతి అన్నది తీసుకోవడం లేదు. వారికి రాజకీయ నాయకుల అండ ఉందని, అధికారులకు ఎంతోకొంత ముట్టజెబుతుండటంతో ఇటు వైపు చూడటం లేదన్న ఆరోపణలు లేకపోలేదు.

ప్రభుత్వ స్థలాల్లోనూ..

జిల్లా కేంద్రం మెదక్ పరిధి పిల్లికొట్టాలలోని ప్రభుత్వ భూమిని కార్యాలయాలకు కేటాయించారు. అక్కడ గుట్ట ఉండటంతో దాన్ని తొలగించాల్సి ఉంది. ఏడాదిగా అక్కడ తవ్వకాలు జరుగుతున్నాయి. అధికారులు వెళ్తే ఓ నాయకుడి పేరు చెబుతుండటంతో వెనకడుగు వేస్తున్నారు. మాతాశిశు సంరక్షణ కేంద్రం ఎదురుగా ఉన్న ఓ స్థలం నుంచి మట్టి తవ్వుతున్నారు. ఒక్కో టిప్పర్ రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు విక్రయిస్తున్నారు.

కొన్ని చోట్ల ఇలా.. పాపన్నపేట మండలం కేంద్రంతో పాటు ఏడుపాయల కమాన్, నామాపూర్, అర్కెల, లక్ష్మీనగర్, మిన్‌పూర్ గ్రామాల శివారులోని అసైన్డ్, పట్టా భూముల నుంచి మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. హవేలిఘనపూర్‌లోని అసైన్డ్ భూమిని తవ్వేస్తూ మట్టిని ఆయా గ్రామాలకు తరలిస్తున్నారు. శివ్వంపేట మండలం రూప్ల తండా, కొత్తపేట్, నవాబుపేట గ్రామాల్లోనూ దందా సాగుతోంది. నార్సింగి వద్ద మల్లన్నగుట్ట, అసైన్డ్ భూముల్లో, చేగుంట మండలం ఇబ్రహీంపూర్, బోనాల, పొలంపల్లి గ్రామాల్లో రాత్రి వేళ పరిశ్రమలు, వెంచర్లకు చేరవేస్తున్నారు. తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లోనూ దందా యథేచ్ఛగా సాగుతోంది. మనోహరాబాద్ మండలం పారిశ్రామిక ప్రాంతం కావడంతో తవ్వకాలు రోజూ సాగుతున్నాయి. వాహనాలను అధికారులు పట్టుకున్నా రాజకీయ నాయకుల అండతో తప్పించుకుంటున్నారు.

జరిమానా విధిస్తున్నాం

జయరాజ్, ఏడీ, గనుల శాఖ

తవ్వకాలు జరుగుతున్నట్లు ఫిర్యాదు వచ్చినా, తనిఖీలో కనిపించినా జరిమానాలు విధిస్తున్నాం. నీటి వనరులపై సంబంధిత అధికారులు పర్యవేక్షించాలి. లేఅవుట్లు, వెంచర్ల ఏర్పాటు సమయంలోనే స్థానిక సంస్థలు పన్నులు వసూలు చేసి అనుమతి ఇస్తారు. ఇతర ప్రాంతాలకు తరలిస్తే చర్యలు తప్పవు.

# స్పందించి సేవానిరతి చాటి..

హుస్నాబాద్ : అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అనే సామెతను ఈ యువకులు నిజం చేస్తున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్త దానమిచ్చి ప్రాణాలు నిలబెడుతున్నారు. అవసరమైన వారికి ఎప్పుడైనా, ఎక్కడైనా సరే అక్కడికి వెళ్లిపోయి రక్తం ఇచ్చేసి సేవాగుణాన్ని చాటుతున్నారు. తమకు సమాచారం అందితే చాలు ఎక్కడున్నా వెంటనే అక్కడ వాలిపోతున్నారు.

వాట్సాప్ ద్వారా..నారాయణఖేడ్‌కు చెందిన ముజ్జు, మునీర్, ఓంప్రకాశ్, దత్తారెడ్డి, లోకేశ్, నవీన్, ప్రవీణ్, సిద్ధారెడ్డి రాజాగౌడ్ తదితరులు మిత్రుల్లో కొంతమంది హైదరాబాద్‌లో ఉంటున్నారు. మరికొందరు స్థానికంగా ఉంటున్నారు. వీరంతా యోగక్షేమాలపై ఆరా తీసేందుకు ఓ వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటుచేసుకున్నా. ఒకసారి రక్తం అవసరం ఉందన్న సమాచారం సదరు గ్రూప్‌లో షేర్ చేశారు. ఆ సమయంలో తమవంతుగా రక్తం దానం చేద్దామన్న ఆలోచనతో ప్రత్యేకంగా నాలుగేళ్ల కిందట నారాయణఖేడ్ బ్లడ్ డోనర్స్ పేరిట వాట్సాప్ గ్రూప్‌ను తెరిచారు. ఇక అప్పటి నుంచి తమ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ఇప్పటివరకు 3 వేల మందికి పైగా దానం చేసి ప్రాణాపాయ పరిస్థితి నుంచి తప్పించారు. ఖేడ్ ప్రాంతం వారు ఎవరైనా ఆసుపత్రుల్లో ఇబ్బందులు పడితే వారికి సాయం చేయడంలోనూ ముందుంటున్నారు.

సామాజిక సేవలో భాగంగా..హుస్నాబాద్‌కు చెందిన పైస శ్రీకాంత్‌కు సినీ హీరో అల్లు అర్జున్ అంటే అభిమానం. ఆయన పేరిట ఏదైనా సామాజిక సేవ చేయాలనే లక్ష్యంతో అల్లు అర్జున్ అభిమానుల రక్తదాతల పేరిట ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. అందులో



200 మంది వరకు ఉన్నారు. వారంతా వేర్వేరు రక్తవర్గాలకు చెందిన వారు. వివిధ సమయాల్లో రక్తం కావాలని ఎవరైనా వారిని సంప్రదిస్తే వారి వివరాలను గ్రూప్‌లో పోస్టు చేస్తున్నారు. దీంతో స్పందించి ఆసుపత్రులకు వెళ్లి రక్తం అందిస్తున్నారు.

కరోనా సమయంలోనూ..నారాయణఖేడ్‌కు చెందిన ముజ్జు ఐదేళ్లుగా రక్తదానం చేస్తున్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రథమ కర్తవ్యంగా భావిస్తూ ముందుకు సాగుతున్నారు. కరోనా సమయంలో రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని సేకరించి బ్యాంకులకు పంపించారు. ఇందుకు 400 మంది ముందుకు రావడం గమనార్హం. హుస్నాబాద్ మండలం పొట్లపల్లికి చెందిన బోనగిరి శ్రీకాంత్ ఇప్పటివరకు 56 సార్లు రక్తదానం చేశారు. మొదట్లో డెంగీతో రక్తకణాలు తగ్గిన సమయంలో పలువురికి ఇచ్చారు. తన తోటి స్నేహితులతో కలిసి ఎవరికైనా అవసరమని తెలియగానే వెంటనే వెళ్లిపోయి తవవంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారు.

# వార్డుకో మైదానం.. ఎప్పటికో!

భూపాలపల్లి : పురపాలక సంఘం పరిధిలో యువత, విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం గత ఏప్రిల్‌లో చెప్పగా.. ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఏర్పాటు కాలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి వార్డుకో ప్రాంగణం ఏర్పాటు చేయాల్సి ఉండగా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆ పరిస్థితి లేదు. ఏదో మొక్కుబడిగా ఏర్పాటు చేసిన మూడింటిని పరిశీలిస్తే... కనీసం ఆటలు ఆడుకునేలా కనిపించడం లేదు.స్థలాల కొరత కారణంగానే..పురపాలక సంఘం పరిధిలో స్థలాల కొరత కారణంగానే ప్రాంగణాల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ స్థలాల్లేక పురోగతి కరవైంది. కొన్నిచోట్ల స్థలాలున్నా ఆక్రమణలో లేదా ఇతర వివాదాల్లో ఉండటంతో చక్కదిద్దే చర్యలకు అధికారులు పూనుకోవడం లేదు. మొత్తం 30 వార్డుల్లో ఏర్పాటు చేయాల్సిన ప్రాంగణాలు ఇప్పటికి మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. మరో ఎనిమిది ప్రాంతాల్లో ఏర్పాటు చేయటానికి ఇటీవల టెండర్లు నిర్వహించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ అవినాష్‌ను వివరణ కోరగా.. స్థలాల కొరత ఉన్న విషయం వాస్తవమే. కనీసం రెండు వార్డులకు ఒకటి చొప్పున క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయటానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే ఎనిమిది ప్రాంతాల్లో ప్రాంగణాల ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించామని అన్నారు.

ఇవి చేయాల్సి ఉంది.. మున్సిపాలిటీలోని యువతకు అందుబాటులో ఉండేలా ప్రతి వార్డులోనూ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి. క్రీడా మైదానాల్లో వాకింగ్ ట్రాక్, ఖోఖో, కబడ్డీ కోర్టులు, సింగిల్, డబుల్ బార్‌లు, లాంగ్ జంప్, క్రీడా పరికరాలు కల్పించాలి. ఆహ్లాదంగా మొక్కలు నాటాలి. ఒక్కో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు రూ.2 లక్షల నుంచి రూ.4లక్షల వరకు వెచ్చించే వీలుందని అధికారులు చెబుతున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 30 వార్డులుంటే ఇప్పటివరకు కేవలం మూడు ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం, సుభాష్‌కాలనీ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక భాగంలో, మిలీనియం క్వార్టర్ల ఏరియాలో దాదాపుగా రూ.6.20 లక్షలు వెచ్చించి మూడు ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఈ మూడింటిలో రెండు ప్రాంగణాలు మరి అధ్వానంగా మారాయి.

ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సింగిల్, డబుల్ బార్ ప్రాంతంలో నిత్యం మురుగు నిలిచిపోవడంతో అటువైపు వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. వాలీబాల్ కోసం రెండు ఇనుప పైపులు అమర్చారు. ఆటలు ఆడుకునేందుకు స్థలం అనుకూలంగా లేదు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక భాగంలో ఏర్పాటు చేసిన ప్రాంగణానికి ముందు బోర్డు ఏర్పాటు చేశారు. ప్రాంగణం మధ్యలో నుంచి నిత్యం ద్విచక్రవాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. పశువులు, పందులు అందులోనే తిరుగుతుంటాయి. చుట్టూ ముళ్లకంచె లేకపోవడంతో అపరిశుభ్రంగా మారుతోంది. నామమాత్రంగా క్రీడా పరికరాలు అమర్చారు.

# పేరుకే ఈనామ్.. దోపిడీ తథ్యం!

మహబూబాబాద్ : ఈనామ్ రాకతో మార్కెట్‌లో తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనుకున్న అన్నదాతకు నిరాశే మిగిలింది. ఉమ్మడి జిల్లాలోని కేసముద్రం, మహబూబాబాద్, జనగామ, నర్సంపేట, పరకాల, వరంగల్ మార్కెట్లలో ఈనామ్ విధానం ప్రారంభించారు. ఆరేళ్లు దాటుతున్నా ఎక్కడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. చివరకు ఆన్‌లైన్ చెల్లింపులూ చేయడం లేదు..ప్రస్తుతం రైతులు వానాకాలం పంటలు ధాన్యం, పత్తి, మొక్కజొన్న విక్రయించేందుకు మార్కెట్లకు వస్తున్నారు. ఇక్కడ కమీషన్ ఏజెంట్లు, వ్యాపారుల హవానే నడుస్తోంది. ఒక్కో మార్కెట్‌లో ఒక్కో రకంగా రైతులను దోపిడీ చేస్తున్నారు.. ఈనామ్ పూర్తిస్థాయిలో అమలు అయితే కూలీ ఛార్జీలు తప్పితే ఒక్కపైసా రైతు ఎవరికీ చెల్లించాల్సిన అవసరం లేదు.. ఈనామ్ అమలు చేస్తున్నామని చెబుతున్న మార్కెట్లలో కేవలం టెండర్లకు మాత్రమే పరిమితం కావడంతో దోపిడీ ఎప్పటిలాగే కొనసాగుతోంది..

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గతంలో కేసముద్రం, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్లలో ప్రత్యక్ష పద్ధతిలో ఖరీదు నిర్వహించారు. ఎలాంటి కమీషన్ లేకుండా అదేరోజు చెల్లింపులు జరిగేవి. కొద్ది రోజులుగా కొంత మంది వ్యాపారులు చెక్కులకు బదులుగా నగదు చెల్లిస్తూ 1 శాతం కోత పెడుతున్నారు.ఈ రైతు పేరు కొసని శ్రీనాథ్. ఊరు కేసముద్రం మండలం ధన్నసరి. వారం రోజుల కిందట కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో 25 బస్తాల ధాన్యం విక్రయించారు. ఓ ట్రేడింగ్ కంపెనీకి చెందిన వ్యాపారి క్వింటాలుకు రూ.2414 చొప్పన ఖరీదు చేశారు. సాయంత్రం తూకం పూర్తి కావడంతో మార్కెట్ కార్యాలయంలో తక్‌పట్టీ తీసుకొని ట్రేడింగ్ కంపెనీ వద్దకు వెళ్లారు. లెక్క చేసి మొత్తం డబ్బులు రూ.38,551 నుంచి రూ.458 హమాలీ ఖర్చులు పోను రూ.38,092 చెల్లించాల్సి ఉన్నట్లు తక్‌పట్టీపై రాశారు. డబ్బులు తీసుకున్న ఆ రైతు లెక్క సరిచూసుకోగా రూ.37,712 మాత్రమే ఉన్నాయి. ఇదేమిటని ప్రశ్నించగా నగదు చెల్లిస్తున్న కారణంగా 1 శాతం కోత పెట్టి ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయం బయట తెలియకూడదనే చిట్టీపై రాయలేదని చెప్పడం కొసమెరుపు.. ఇది ఒక రైతు శ్రీనాథ్ పరిస్థితి కాదు.. మార్కెట్లో నిత్యం సరకులు విక్రయిస్తున్న వందలాది రైతులది ఇదే పరిస్థితి....

ఇదీ పరిస్థితి.. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఈ సీజన్‌లో ఒకరోజు రూ.2 కోట్ల వరకు క్రయవిక్రయాలు జరుగుతాయి. నగదు పేరుతో రైతుల నుంచి రోజుకు రూ.2 లక్షల వరకు దోపిడీ చేస్తున్నారు. మహబూబాబాద్ మార్కెట్‌లో రోజుకు రూ.కోటి వరకు క్రయ విక్రయాలు జరుగుతాయి. 1 శాతం చొప్పన రూ.లక్ష దోపిడీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని కొన్ని మార్కెట్లలో నగదు చెల్లిస్తున్నామని 1 శాతం, మరికొన్ని మార్కెట్లలో అడ్తీ కమీషన్ పేరుతో 2 నుంచి 3 శాతం కోత పెడుతున్నారు.

వారం రోజులు వాయిదా పెడుతున్నారు

దరంసోతు నరేశ్, క్యాంపుతండా, కేసముద్రం

కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో 20 క్వింటాళ్ల ధాన్యం విక్రయించాను. క్వింటాలుకు రూ.2,359 ధర పలికింది. మార్కెట్‌లో తక్‌పట్టీ తీసుకొని వ్యాపారి వద్దకు వెళ్లాను. వారం రోజుల తరువాత డబ్బులు చెల్లిస్తామని చెప్పారు. వెంటనే డబ్బులు కావాలంటే 1శాతం కోత పెట్టుకొని ఇస్తామన్నారు. 1 శాతం నష్టపోవడం ఇష్టంలేక వారం రోజుల తర్వాత డబ్బులు తీసుకున్నాను.

చెక్కులు ఇవ్వకుండా..రాంజీనాయక్, మూలస్తంభంతండా, కేసముద్రం

కొంతమంది వ్యాపారులు చెక్కులు ఇవ్వకుండా రైతులకు మాయ మాటలు చెబుతూ నగదు పేరుతో 1 శాతం కోత పెడుతున్నారు. తక్‌పట్టీపై హమాలీ, కూలీల డబ్బులు తీసివేసి రైతులకు ఇచ్చే మొత్తం డబ్బులు రాస్తున్నారు. కొత్త పెట్టిన మొత్తం మాత్రం చిట్టీపై రావడం లేదు.

పూర్తి స్థాయిలో అమలు చేస్తాంమల్లేశం, మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు

ప్రస్తుతం ఈనామ్‌పై అమలుపై మార్కెటింగ్ డైరెక్టర్ తరచూ ఆన్‌లైన్‌లో అధికారులు, మార్కెట్ కమిటీలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందుకు అవసరమైన సాంకేతిక పరికరాలను సమకూర్చుతున్నాం. త్వరలో పూర్తిస్థాయిలో ఈనామ్ పద్ధతితో ఖరీదులు నిర్వహించి ఏ రోజు డబ్బులు ఆరోజు ఆన్‌లైన్‌లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.




సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ దేశ రాజకీయం వేడెక్కుతోంది. తాజాగా ప్రధాని మోదీ విపక్ష పార్టీల సదస్సుపై విమర్శలను ఎక్కుపెట్టారు. పోర్టుబ్లెయర్‌లోని వీర్ సావర్కర్ అంతర్జాతీ విమానాశ్రయ టర్మినల్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వం గత ప్రభుత్వం కంటే రెండింతల నిధులను అండమాన్ అండ్ నికోబార్ దీవుల కోసం వెచ్చించిందని పేర్కొన్నారు. పనిలో పనిగా విపక్షాలనుద్దేశించి మాట్లాడుతూ.. " కుటుంబం కోసం, కుటుంబం చేత, కుటుంబం కొరకు అనేది వారి మంత్రం. పచ్చి అవినీతిపరులు సదస్సు జరుగుతోంది" అని విరుచుకుపడ్డారు. " గత 9 ఏళ్లలో పాత ప్రభుత్వాల తప్పులు సరిచేయడంతోపాటు.. ప్రజలకు కొత్త సౌకర్యాలు, సదుపాయాలు అందుబాటులోకి తెచ్చాం. ఇప్పుడు భారత్‌లో కొత్తరకం అభివృద్ధి విధానం ఉంది. అదే సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అండమాన్-నికోబార్ దీవుల్లో పెరిగిన పర్యాటక రంగం మరిన్ని ఉద్యోగావకాశాలను సృష్టించిందన్నారు. కానీ, గతంలో స్వార్థపూరిత రాజకీయాలతో అభివృద్ధి పనులు మారుమూల ప్రాంతాలకు చేరడం సాధ్యం కాలేదన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన పనులతో ఈ ద్వీపాల్లో పర్యాటక రంగం వృద్ధి చెందిందని పేర్కొన్నారు. మరోవైపు బెంగళూరులో నిన్న మొదలైన విపక్షాల భేటీ నేడు కూడా కొనసాగనుంది. నిన్న రాత్రి జరిగిన సమావేశంలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, అగ్రనేత రాహుల్ గాంధీ సహా 26 పార్టీల నేతలు పాల్గొన్నారు. కాగా.. విపక్షాల కూటమిలో యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీకి కీలక బాధ్యతలు అప్పజెప్పే అవకాశాలున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## ఢిల్లీ లిక్కర్ స్కాంలో మాగుంట రాఘవకు బెయిల్ మంజూరు.. ఈసారి ఈడీ కూడా..




న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో నిందితుడిగా ఉన్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు మాగుంట రాఘవకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అనారోగ్య కారణాలపై మాగుంటకు నాలుగు వారాల పాటు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. అయితే ఈసారి రాఘవకు బెయిల్ ఇవ్వడాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వ్యతిరేకించలేదు. గతంలో ఢిల్లీ హైకోర్టు రాఘవకు బెయిల్ ఇవ్వగా దాన్ని వ్యతిరేకిస్తూ ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. కాగా.. ఈరోజు మాగుంట రాఘవకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఇవ్వడాన్ని మాత్రం ఈడీ వ్యతిరేకించలేదు. విచారణకు ఎప్పుడు పిలిచినా ఈడీ ముందు హాజరుకావాలని రాఘవను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది.

ఢిల్లీ లేదా చెన్నై కార్యాలయాల్లో విచారణకు హాజరుకావచ్చని తెలిపింది. చెన్నై వదిలి వెళ్లవద్దని ఢిల్లీ హైకోర్టు షరతు విధించింది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఫిబ్రవరి 10న రాఘవను ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సౌత్ గ్రూప్‌లో కీలక పాత్రధారిగా రాఘవను ఈడీ పేర్కొంది. ఢిల్లీలో పలు జోన్లకు రాఘవ ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఈడీ ఆరోపించింది. మరోవైపు ఈడీ కేసులో త్వరలో దినేష్ అరోరా అప్రవర్‌గా మారనున్నారు. గతంలో సీబీతఐ కేసులో దినేష్ అరోరా అప్రూవర్‌గా మారిన విషయం తెలిసిందే.

## టీడీపీ, వైసీపీ దొందు దొందే...



అమరావతి: ప్రత్యేక హెూదా, విభజన చట్టంలోని అంశాల సాధనలో వైసీపీ, టీడీపీ దొందు దొందే అని పీసీసీ మీడియా కమిటీ చైర్మన్ తులసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రతేక హెూదా సాధించడం లో టీడీపీ, వైసీపీ రెండు పార్టీలు విఫలం అయ్యాయన్నారు. రాయలసీమకు, ఉత్తరాంధ్రకు భుందెలండ్ తరహా అభివృద్ధి ప్యాకేజీని సాధించడంలో రెండు పార్టీలు వైఫల్యం చెందాయని విమర్శించారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్, దుగ్గరాజపట్నం ఓడరేవు, పోలవరం ప్రాజెక్టు, విశాఖ మెట్రో, విజయవాడ మెట్రో, రాజధాని తదితర అంశాలలో రెండు పార్టీలు విఫలం చెందాయన్నారు. బీజేపీ చేతిలో వైసీపీ, టీడీపీ పార్టీలు కీలు బొమ్మలు అంటూ వ్యాఖ్యలు చేశారు. బీ...అంటే బాబు, జే.. అంటే జగన్, పీ.. అంటే పవన్ అన్న విధంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ప్రత్యేక హెూదా, విభజన చట్టంలోని అంశాల అమలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తులసిరెడ్డి స్పష్టం చేశారు.




## అసలోడు వచ్చే వరకూ కొసరోడికి పండగే..?

## ఒంగోలులో లోకేష్ కు జూ.ఎన్టీఆర్ ఫ్యాన్స్ షాక్.. !

ఒంగోలు : ఏపీలో వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో ఎలాగైనా టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకు ఓవైపు నారా లోకేష్ పాదయాత్ర చేస్తుండగా.. ఇప్పుడు ఆయనకు పార్టీలో కనిపించని ప్రత్యర్థిగా మారిన జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు చికాకు పెడుతున్నారు. ఇప్పటికే చంద్రబాబు టూర్లలో జూనియర్ ఎన్టీఆర్ నినాదాలు చేస్తూ ఆయన్ను చికాకు పెడుతున్న జూనియర్ అభిమానులు ఇప్పుడు నారా లోకేష్ ను సైతం టార్గెట్ చేసుకుంటున్నారు.

ఒంగోలులో తాజాగా ఇలాంటిదే మరో ఘటన చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లాలో పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్ కు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు అనుకోని షాకిచ్చారు. జూనియర్ ఎన్టీఆర్ ను తదుపరి సీఎంగా పేర్కొంటూ ఓ ఫ్లెక్సీ పెట్టారు. అంతటితో ఆగకుండా ఓ కోట్ కూడా పెట్టారు. దీంతో ఇప్పుడు ఆ కొటేషన్ లో వాడిన పదాలు కచ్చితంగా లోకేష్ తో పాటు చంద్రబాబును కూడా మంటపుట్టించేలా ఉన్నాయి. ఈ నేపథ్యంలో లోకేష్ కానీ, టీడీపీ నేతలు కానీ ఎలా స్పందిస్తారన్నది చూడాల్సి ఉంది. ఇంతకీ ఆ ఫ్లెక్సీలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఏం పెట్టారో తెలుసా. అసలోడు వచ్చే వరకూ కొసరోడికి పండగే అనే కామెంట్ ను ఫ్యాన్స్ పెట్టారు. దీనర్థం అసలోడైన జూనియర్ ఎన్టీఆర్ వచ్చే వరకూ కొసరోడు అయిన నారా లోకేష్ కు పండగే అన్న మాట. ఇప్పుడు పాదయాత్రగా వస్తున్న నారా లోకేష్ కు భవిష్యత్తులో జూనియర్ ఎన్టీఆర్ పార్టీలో క్రియాశీలకం అయి బాధ్యతలు చేపట్టే వరకూ పండగే అనే అర్థం వచ్చేలా ఫ్యాన్స్ పెట్టిన ఈ ఫ్లెక్సీ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా వైరల్ అవుతోంది. గతంలో 2009 ఎన్నికల సమయంలో ఓసారి టీడీపీ కోసం తిరిగి విస్తృతంగా ప్రచారం చేసిన జూనియర్ ఎన్టీఆర్.. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయాక మళ్లీ కనిపించలేదు. అయితే చంద్రబాబు తన కుమారుడు లోకేష్ కోసమే జూనియర్ ను పక్కనబెట్టేశారన్న ప్రచారం మాత్రం రాష్ట్రవ్యాప్తంగా తీవ్రంగా సాగుతోంది.

కానీ చంద్రబాబు కుటుంబంతో ఇప్పటికీ సన్నిహితంగా ఉంటున్న జూనియర్ ప్రస్తుతం సినిమాలపైనా తన దృష్టిపెట్టారు. భవిష్యత్తులో టీడీపీ పరిస్థితి మరీ దారుణంగా మారితే అప్పుడు ఆయన ఎంట్రీ ఇవ్వొచ్చన్న ప్రచారం మాత్రం సాగుతోంది. ఈ లోపు ఆయన అభిమానులు చంద్రబాబు, లోకేష్ ను చికాకుపెడుతున్నారు.

## అక్కడ జూ.ఎన్టీఆర్ ఫ్లెక్సీలు మా పార్టీ వాళ్లే పెట్టారు



న్యూఢిల్లీ: ఒంగోలులో పెద్ద ఎత్తున నటుడు జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై ఎంపీ రఘురామకృష్ణ రాజు స్పందించారు. తమ పార్టీ నేతలే ఒంగోలులో జూనియర్ ఎన్టీఆర్ ఫోటో ఫ్లెక్సీలు వేశారని.. తమ పార్టీ వారికి ఏ పని సరిగా చేయడం రాదంటూ వ్యాఖ్యలు చేశారు. జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఫ్లెక్సీలు వేస్తే అందులో హరికృష్ణ ఫోటో ఉండేదన్నారు. లోకేష్ మీటింగ్ ప్రకాశంలో ఉంటే అక్కడ జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలు వైసీపీ వాళ్లే పెట్టారని తెలిపారు. లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతంగా కొనసాగుతోందన్నారు. అమ్మఒడి సగం మంది పిల్లలకు ఇంకా రాలేదని.. పిల్లలు మామయ్య నొక్కేసిన డబ్బులు ఇంకా రాలేదు అని అంటున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఫోటోలు వేసుకుంటున్నారని మండిపడ్డారు. మద్యం అమ్మకాలు తగ్గాయని... కానీ ఆదాయం పెరిగిందన్నారు. దొంగ సప్లయ్ చేస్తున్నారని.. అమ్మకాలు తగ్గలేదని తెలిపారు. ఈ ప్రభుత్వం పోవటం ఖాయమని ఎంపీ రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలు చేశారు.




దిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలని, ఎర్ర గంగిరెడ్డికి బెయిల్ ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా పడింది. గంగిరెడ్డి పిటిషన్‌నూ అవినాష్ బెయిల్ రద్దు పిటిషన్‌కు జత చేస్తూ.. సెప్టెంబర్ రెండో వారంలో విచారణ చేపడతామని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. అవినాష్ బెయిల్ రద్దు పిటిషన్‌పై కౌంటర్ దాఖలుతోపాటు వివేకా హత్య కేసు వివరాలు, డైరీ సీల్డ్ కవర్‌లో అందించాలని సీబీఐని ఆదేశించింది. జూన్ 30న దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని సుప్రీంకోర్టు సూచించింది. గంగిరెడ్డికి వెంటనే బెయిల్ మంజూరు చేయాలంటూ.. అతడి తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా గంగిరెడ్డి న్యాయవాదిపై ధర్మాసనం ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఇది హత్య కేసు.. బెయిల్ వ్యవహారాలు ఆచితూచి ఉంటాయి. చాలా సాక్ష్యాలు ఉన్నాయి. బెయిల్ కోసం వేచి చూడాల్సిందే" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. గంగిరెడ్డి బెయిల్ పిటిషన్‌ను అవినాష్ బెయిల్ రద్దు పిటిషన్‌తో జతచేయొద్దన్న విజ్ఞప్తిని తోసిపుచ్చింది. గంగిరెడ్డికి బెయిల్ ఇవ్వాలన్న తెలంగాణ హైకోర్టు ఆదేశాలపై గతంలో సుప్రీంకోర్టు స్టే విధించింది. ఇప్పుడు ఆ ఆదేశాలు కొనసాగుతాయని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

## 'పవన్ నిలకడ లేనోడు.. బీజేపీతో కలవడం ప్రమాదకరం'




హైదరాబాద్: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్డీయే మిత్రపక్ష కూటమి సమావేశానికి హాజరు కానున్న నేపథ్యంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ స్పందించారు. ప్రత్యేక ప్యాకేజీని పాచిపోయిన లడ్డూలతో పోల్చి.. ఇవాళ ఎన్డీయేలో ఎలా చేరుతున్నాడో చెప్పాలంటూ పవన్‌ను ఏకిపారేశాయాన. పవన్ కల్యాణ్ తీరు బాధాకరమని, ఈ తీరు సరికాదని ఆక్షేపించారు. "పవన్ కల్యాణ్ ఒక దళారీ.. అందుకే టీడీపీ-బీజేపీ మధ్య అనుబంధానం చేస్తున్నాడు. ఈ మధ్యవర్తిత్వం అస్సలు మంచిది కాదు. గతంలో పవనే ప్రత్యేక ప్యాకేజీని పాచిపోయిన లడ్డూలతో పోల్చాడు. అసలు ప్రత్యేక హెూదా ఇవ్వని బీజేపీతో ఎలా అంటకాగుతారు? అని నారాయణ పవన్‌ను నిలదీశారు. పైగా బీజేపీతో కలవడం.. లౌకిక వాదానికి ప్రమాదకరమని అన్నారాయన. నిన్నటి వరకు చేగువేరా దుస్తులు వేసుకుని.. ఇప్పుడు సావర్కర్ దుస్తులు వేసుకునేందుకు సిద్ధమయ్యాడు. రేపు గాడ్సేలా తుపాకీ పట్టుకునేందుకు సిద్ధమవుతాడు. అసలు పవన్‌కు నిలకడ లేదు. కదలకుండా మూడు నిమిషాలు మాట్లాడగలిగితే.. ఆ తర్వాత పవన్ రాజకీయ స్థిరత్వం గురించి మాట్లాడుకోవచ్చు అని ఎద్దేశా చేశారాయన.

## 'ఆళ్ల' ఫ్యామిలీలో టికెట్ రగడ.. సింపతీ డామినేట్ చేస్తోందా..?



గుంటూరు : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మంగళగిరి నియోజకవర్గం వైసీపీలో టికెట్ రగడ అంతర్గత కుమ్ములాటల కు దారితీస్తోందనే చర్చ జోరుగా సాగుతోంది. మంగళగిరి నియోజకవర్గంలో ఒకప్పుడు ఆళ్ల రామకృష్ణా రెడ్డి పేరు మార్మోగేది. అయితే.. ఇటీవల కాలంలో ఎక్కడ చూసినా.. ఆయన అన్నయ్య రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ఫెక్సీలు కనిపిస్తున్నాయి. ఎవరి నోట విన్నా.. ఆయన మాటే వినిపిస్తోంది. ముఖ్యంగా పలు మండలాల్లో అయితే.. భారీ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. అక్కడ రోడ్లు ఇంటింటికీ తాగునీరు(జలజీవన్ మిషన్ ద్వారా) వంటి పనులు జోరుగా సాగుతున్నాయి. దీంతో అంతా ఎంపీ కనుసన్నల్లోనే జరుగుతోందనే ప్రచారం జోరుగా ఉంది. ఇక మరోవైపు.. వచ్చే ఎన్నికల్లో రామకృష్ణారెడ్డికి టికెట్ కష్టమేనని.. ఆయనను వేరే స్థానానికి పంపించే అవకాశం ఉందని కూడా కొందరు చెబుతున్నారు. మంగళగిరి నుంచి అయోధ్యరామిరెడ్డి పోటీకి సై అంటున్నారని.. ఆళ్ల వర్గానికే చెందిన కొందరు లీకులు ఇస్తున్నారు. మరి ఇదే విషయంలో అన్నదమ్ముల మధ్య కూడా.. వివాదం నెలకొందని అందుకే దాదాపు రెండు నెలలుగా ఆళ్ల రామకృష్ణారెడ్డి బయటకు కూడా రావడం లేదని.. పార్టీ అధిష్టానం కూడా ఆయనను పెద్దగా పట్టించుకోవడం మానేసిందని ఒక వర్గం ప్రచారం చేస్తోంది. ప్రస్తుతం పార్టీకి కావాల్సింది.. గెలుపు ఒక్కటేనని చెబుతున్నారు. ఎవరు పోటీ చేసినా మంగళగిరిని గెలిస్తే.. చాలన్నట్టుగా పార్టీ అధిష్టానం ఉన్నట్టు మెజారిటీ నాయకులు చెబుతున్నారు. ఇది వాస్తవమేనని తాడేపల్లి వర్గాలు కూడా చెబుతున్నాయి.

ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం మంగళగిరిలో ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ప్రభావం ఎక్కువగా ఉందని.. ఆయనైతే.. గెలుపు గుర్రం సునాయాసంగా ఎక్కుతారని మంచి పేరు కూడా ఉందని పార్టీ కూడా లెక్కులు వేస్తున్నట్టు చెబుతున్నా రు. మొత్తానికి ఎమ్మెల్యే టికెట్ వ్యవహారం ఆళ్ల ఫ్యామిలీలో రగడ పెడుతోందని అత్యంత విశ్వసనీయ వర్గాలు కూడా చెబుతుండడం గమనార్హం.

## నెల్లూరుకు జగన్.. అధికారుల అత్యుత్సాహం




నెల్లూరు: జిల్లాకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాక సందర్భంగా అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఈనెల 21న సీఎం జగన్ జిల్లాలో పర్యటించనున్నారు. సీఎం రాక సందర్భంగా వెంకటగిరిలో అధికారులు రెచ్చిపోయారు. పట్టణంలోని త్రిభువని సెంటర్లో రోడ్ సైడ్ దుకాణాలను మున్సిపల్ శాఖ అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి విగ్రహ ప్రారంభోత్సవం కోసం దుకాణాలను ఖాళీ చేయిస్తున్నట్లు చిరు వ్యాపారులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. తమ దుకాణాలును తొలగించడంతో రోడ్ సైడ్ దుకాణా దారులు, చిరు వ్యాపారులు బోదిబోమంటున్నారు. ఎంత చెప్పినప్పటికీ అధికారులు వినిపించుకోకపోవంతో ఏమీ చేయలేని స్థితిలో చిరు వ్యాపారులు ఉండిపోయారు.

## పంచకర్ల రమేష్ జనసేనలో చేరే తేదీ ఖరారు..



విశాఖపట్నం: వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ జనసేన పార్టీలో చేరడంపై క్లారిటీ ఇచ్చారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... ఈనెల 20న సాయంత్రం 4 గంటలకు జనసేనలో చేరనున్నట్లు ప్రకటించారు. జనసేనలో కార్యకర్తగా చేస్తానని తెలిపారు. 400 కార్లు, 25 బస్సులతో అమరావతి వెళ్లనున్నట్లు చెప్పారు. 20న మధ్యాహ్నం 3:30 గంటలకు జనసేన పార్టీ కార్యాలయానికి వెళతానని.. కార్యకర్తలతో మాట్లాడిన తరువాత తమ కార్యకర్తలు కూడా జనసేనలో చేరడం వలన గౌరవం పెరుగుతుందని చెప్పారు. వైసీపీలో కూడా బాగానే పనిచేశానని తెలిపారు. ఏ పార్టీలో లేనప్పుడు పెందుర్తి నుంచే పోటీచేస్తాను అన్నానని.. అది తన వ్యక్తిగతమని చెప్పుకొచ్చారు. ఇక నుంచి తమ అధినేత పవన్ కళ్యాణ్ ఏది చెప్తే అదే చేస్తానని ఆయన తెలిపారు. తాను పార్టీలో జాయిన్ అవుతానని మాత్రమే పవన్ కళ్యాణ్‌ను అడిగనట్లు చెప్పారు. పార్టీ వ్యవహారాల గురించి తనతో ఏమీ చేర్చించలేదన్నారు. వైసీపీలో పనిచేసిన రెండున్నరేళ్లలో ఎక్కడ ఆర్థిక లబ్ధి పొందలేదని తెలిపారు. తనపై అలాంటి ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని స్పష్టం చేశారు. సుబ్బారెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవన్నారు. వైసీపీలో ఉన్నప్పుడు పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేయమని అడిగినా తాను విమర్శలు చేయను అని అన్నట్లు తెలిపారు. శృతి మించి మాట్లాడటం తన నైజం కాదన్నారు. జనసేన జాయిన్ కావడానికి ము%శీ%దు చిరంజీవి కుటుంబంతో గాని వేరే ఎవరితో మాట్లాడలేదన్నారు. వైసీపీలో తనకు గౌరవం లేకపోవడం వలనే బయటకి వచ్చినట్లు పంచకర్ల రమేష్ బాబు చెప్పుకొచ్చారు.

## తక్కువ ధరకు కిలో టమాటా.. 2 కి.మీ మేర ప్రజల క్యూ



కడప : టమాటా ధరలు చుక్కలనంటుతోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాయితీ ధరకు టమాటాను దక్కించుకునేందుకు కడపలో ప్రజలు బారులు తీరారు. స్థానిక రైతు బజారు వద్ద కిలో రూ.50కే విక్రయిస్తుండటంతో ఉదయం నుంచే క్యూలైన్‌లో నిల్చొని టమాటాలు కొనుగోలు చేశారు. ఉదయం 5 గంటల నుంచే వినియోగదారులు సుమారు 2 కిలోమీటర్ల మేర బారులు తీరారు. మధ్యాహ్నం 12 గంటలు పూర్తయినప్పటికీ రద్దీ ఏమాత్రం తగ్గలేదు. బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా ధర రూ.120 నుంచి 150 వరకు ఉండటంతో రైతు బజారులో కొనుగోలుకు ప్రజలు పోటీ పడ్డారు.

## సాయం చేయకపోతే చనిపోయినవాళ్లతో సమానం! సాయిపల్లవి

సాయి పల్లవి ఏడాది కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. చివరిగా 'విరాట పర్వం' సినిమాలో కనిపించింది. ఆ తర్వాత అమ్మడి జాడ కానరాలేదు. అవకాశాలు లేక నటించలేదా? రాక నటించలేదా? అన్నది సస్పెన్స్ . తాజాగా ఆ మధ్య అమర్ నాథ్ యాత్రకు వెళ్లిన కొన్ని ఫోటోలు నెట్టింటం పంచుకున్న సంగతి తెలిసిందే. తాజాగా మరికొన్ని ఫోటోలు షేర్ చేస్తే అమర్ నాథ్ అనుభవాలు.. అనుభూ తులు పంచుకున్నారు. ఆ వేంటో ఆమె మాటల్లోనే.. 'వ్యక్తిగత విషయాలు పంచుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపించను. కానీ అమరనాథ్ యాత్ర గురించి అందరికీ చెప్పాలను



కుంటున్నా. ఎంతో కాలం నుంచి కలలు కంటోన్న యాత్ర ఇది. 60 ఏళ్ల వయసున్న తల్లిదండ్రులను ఈ యాత్రకి తీసుకెళ్లడం సవాల్ తో కూడుకున్నదే. కొన్నిసార్లు ఊపిరి తీసుకోవడం ఇబ్బంది గా మారుతుంది. నడవలేక చాలా అవస్తలు పడతారు. దారి మధ్యలో అలసిపోవడం వంటివి చూసి స్వామి మీరు ఎందుకు ఇంత దూరంలో ఉన్నారు? అనిపిస్తుంది. అయితే దైవ దర్శనం అనంతరం నా ప్రశ్న కి సమాధానం దొరికింది. కొండ కిందకు దిగి వచ్చేటప్పుడు మనసును హత్తుకునే దృశ్యం ఒకటి చూసా. యాత్రని కొనసాగించలేక ఇబ్బంది పడుతోన్నప్పుడు వాళ్లలో ధైర్యం నింపడం కోసం చుట్టు పక్కల వారు ఓం నమశివాయా అంటూ స్వామి వారిని స్మరించేవారు. వెళ్లలేం అనుకున్న వారు కూడా ఒక్కసారిగా అడుగుల ముందుకెసి ఉత్సాహంగా కదిలేవారు. మాలాంటి లక్షలాది భక్తులకు ఈ యాత్ర ఓ చిరస్మరణీయం చేసిన అందరికీ ప్రణామాలు. ఈ యాత్ర నా సంకల్ప శక్తిని సవాల్ చేయడంతో పాటు నాధైర్యాన్ని పరీక్షించింది. మన జీవితమే ఓ తీర్ధ యాత్రని తెలియజే సింది. మనిషిగా ఉన్నందుకు ఎదుట వ్యక్తులకు సాయం చేయకపోతే మనం చనిపోయిన వాళ్లతో సమానం. సంపద.. అందం..పవర్ తో సంబంధం లేకుండా ఇతరులకు సాయం చేయడమే ఈ భూమిపై మన ప్రయాణానికి విలువనిస్తుంది' అని అన్నారు.

## ప్రణీత.. క్యాజువల్ డ్రెస్లోనూ మెరుపులే..

టాలీవుడ్ గ్లామరస్ హీరోయిన్ ప్రణీత సుభాష్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్గా ఉండే ఈ బ్యూటీ వరుసగా తన ఫొటోషూట్స్తో అభిమానులను ఖుషీ చేస్తుంటుంది. బావ చిత్రంతో ఈ కన్నడ సోయగం తెలుగు ఆడియెన్స్కు చాలా దగ్గరైంది. మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ చిత్రంలో తన అందం అభినయంతో ఆడియెన్స్ను కట్టిపడేసింది. దీంతో టాలీవుడ్ నుంచి ఈ ముద్దుగుమ్మకు వరుస ఆఫర్లు క్యూ కట్టాయి అప్పటి నుంచి తెలుగు ప్రేక్షకులను అలరిస్తూ వస్తోంది. అలా స్టార్ హీరోల సరసన నటించి స్పెషల్ ఇమేజ్ను సొంతం చేసుకుంది. హీరోయిన్గా తక్కువ చిత్రాల్లోనే నటించినా తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చోటు సంపాదించుకుంది. అత్తారింటికి దారేది పాండవులు పాండవులు తుమ్మెద రభస బ్రహ్మోత్సవం హలో గురు ప్రేమకోసమే వంటి చిత్రాల్లో సెకండ్ హీరోయిన్గా అలరించింది. చివరిగా ఎన్టీఆర్



కథానాయకుడులోనూ మెరిసింది. ప్రస్తుతం కన్నడ హిందీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంటోంది. మరోవైపు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్గా ఉంటూ బ్యాక్ టు బ్యాక్ ఫొటోషూట్స్తో అదిరిపోయే అవుట్ ఫిట్లలో ఫ్యాన్స్తో పాటు నెటిజన్లను ఫిదా చేస్తోంది. సినిమాల అప్డేట్స్ ఎక్కువగా ఇవ్వకున్నా.. తన వ్యక్తిగత విషయాలను మాత్రం అభిమానులతో ఎప్పటికప్పుడు పంచుకుంటూ ఉంటుంది. అయితే తాజాగా క్యాజువల్ డ్రెస్లో కనిపించి మరోసారి యూత్ హృదయాలను కొల్లగొట్టింది. లైట్ గ్రీన్ ట్రాన్స్ ఫరెంట్ షర్ట్ వైట్ పాంట్లో కనిపించి ఆకట్టుకుంది. తన పోజులతో మతిపోగొట్టింది. ఇది చూసిన నెటిజ్లను క్రేజీగా కామెంట్లు పెడుతున్నారు. కాగా కొంతకాలం క్రితం వివాహ బంధంలో అడుగుపెట్టిన ఈ బ్యూటీ చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటోంది. పెళ్లి ప్రెగ్నెన్సీ కారణంగా కాస్త బ్రేక్ వచ్చింది. 2021లో వ్యాపార వేత్త నితిన్ రాజును ప్రేమించి పెళ్లి చేసుకుంది. 2022 జూన్ 10న బెంగళూరులో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చి తల్లిగా ప్రమోషన్ పొందింది. కానీ సోషల్మీడియాలో మాత్రం యాక్టివ్గా ఉంటూ అభిమానులు అలరిస్తోంది.




## ఆండ్రియా సొగసులకు ఎవరైనా ఫిదా కావాల్సిందే..!



తమిళ హాట్ బ్యూటీ ల్లో ఆండ్రియా జెరెమియా ఒకరు. విభిన్న చిత్రాల్లో తన నటనతో ఆమె ఇప్పటికే చాలా మందిని మెస్మరైజ్ చేసేసింది.. తమిళ్ డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరించింది ఆండ్రియా. ఇక్కడి ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు. డైరెక్ట్ గా తెలుగులోనూ ఓ సినిమాలో నటించారు. నాగ చైతన్య తడాఖా సినిమాలో ఆమె తన నటతో ఆకట్టుకున్నారు. ఆండ్రియా మల్టీ టాలెంటెడ్. కేవలం నటించడమే కాదు ఆమెలో చాలా స్పెషల్ క్వాలిటీలు ఉన్నాయి. ఈ బ్యూటీ కేవలం నటిగానే కాదు సింగర్ గానూ తన ప్రతిభను చాటారు. రామ్ చరణ్ నటించిన ఎవడు సినిమాలో ఓయే ఓయే పాట పాడి అలరించింది. ఇక నాగచైతన్య దడ సినిమాలోని దీవాళీ దీపాన్ని పాట ఎంత ఫేమసో తెలిసిందే. ఈ బ్యూటీ అటు సినిమాల్లో నటిస్తూ.. ఇటు సింగర్ గా తన సత్తా చాటుకుంటోంది. సినిమాల్లో మాత్రమే కాదు అప్పుడప్పుడు మ్యూజిక్ షోలు కూడా చేస్తూ ఆకట్టుకుంటూ ఉంటుంది. ఆమె దాదాపు 15 సంవత్సరాల పాటు మ్యూజిక్ నేర్చుకోవడానికి క్లాసులకు వెళ్లిందట. అందుకే తాను ఈ విధంగా పాడగులుగుతున్నానంటూ గతంలో చెప్పడం విశేషం. ఆండ్రియా తమిళ సినీ పరిశ్రమలోకి ముందుగా సింగర్గా ఎంట్రీ ఇచ్చారు. 2005లో 'కందా నాల్ ముదల్' అనే తమిళ సినిమా ద్వారా సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. ఆండ్రియా సోషల్ మీడియాలోనూ చాలా చురుకుగా ఉంటారు. ఎప్పటికప్పుడు తన ఫోటోలను షేర్ చేసి అలరిస్తూ ఉంటుంది. తాజాగా ఆమె కొన్ని ఫోటోలు షేర్ చేయంగా అవి ఫ్యాన్స్ ని విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. రకరకాల డ్రెస్సులు ధరించి హాట్ షో చేసింది. అన్ని ఫోటోల్లోనూ ఆమె ఎక్కువగా థైస్ షో చేయడం విశేషం. ఈ ఫోటోల్లో ఆమె చాలా హాట్ గా కనిపిస్తోంది. ఆమె వయసు 40కి చేరువ అవుతున్నా కూడా గ్లామరస్ గా కనపడుతోంది. ఈ సంగతి పక్కన పెడితే ఆండ్రియా చాలా సార్లు వార్తల్లోకి ఎక్కిన సందర్భాల్లో ఉన్నాయి.తమిళ హీరోలు మ్యూజిక్ డైరెక్టర్లతో ఆమెకు లవ్ ఎఫైర్స్ ఉన్నాయని వార్తలు రావడం విశేషం. ముఖ్యంగా ధనుష్ ఫహాద్ ఫాజిల్ అనిరుధ్ రవిచందర్ వంటి వారితో ప్రేమాయణం నడిపిందని అప్పట్లో వార్తలు గుప్పుమన్నాయి. అనిరుధ్ తో అయితే ఏకంగా ఫోటోలు కూడా బయటకు లీక్ అవ్వడం విశేషం.

## క్యూట్ పప్పీస్ తో ప్రభాస్ క్యూటీ



మహేష్ బాబు '1 నేనొక్కడినే' సినిమా తో హీరోయన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ క్రితి సనన్. తెలుగు లో ఈ అమ్మడు మొదటి సినిమా తో ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కించుకోలేక పోయింది. ఆ సినిమా ఫ్లాప్ అవ్వడంతో కృతి సనన్ బాలీవుడ్ లో సినిమాల వైపు అడుగులు వేసింది. ప్రస్తుతం బాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్.. క్రేజీ హీరోయిన్ గా కృతి సనన్ దూసుకు పోతుంది. హీరోయిన్ గా ఈ అమ్మడు ఏడాదికి మూడు నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ ఏడాది ఈమె నటించిన నాలుగు అయిదు సినిమాలు విడుదల అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. హీరోయిన్ గా ఇంత బిజీగా ఉన్నా కూడా సోషల్ మీడియాలో రెగ్యులర్ గా హాట్ ఫొటోలు షేర్ చేస్తూ సందడి చేస్తూనే ఉంటుంది. ఇన్ స్టా లో ఈ అమ్మడి యొక్క ఫాలోవర్స్ సంఖ్య 52 మిలియన్స్ పైనే. రెగ్యులర్ గా తన ఫాలోవర్స్ కోసం ఈ అమ్మడు హాట్ అందాల ఆరబోతతో పాటు అప్పుడప్పుడు ఇలాంటి క్యూట్ ఫొటోలు షేర్ చేస్తోంది. త్వరలో ఈ అమ్మడు ప్రభాస్ తో కలిసి ఆదిపురుష్ సినిమాతో రాబోతున్న విషయం తెల్సిందే. తాజాగా ఈ అమ్మడు క్యూట్ పప్పీస్ తో ఉన్న తన క్యూట్ ఫొటోను షేర్ చేసింది. పెద్దగా మేకప్ లేకుండా నాచురల్ స్మైల్ తో చాలా క్యూట్ గా కృతి సనన్ ఉందంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఆ మధ్య ఈ అమ్మడు ప్రభాస్ తో ప్రేమలో ఉందనే వార్తలు జోరుగా వచ్చాయి. ఇద్దరి మధ్య వ్యవహారం కాస్త ఎక్కువ దూరం వెళ్లిందని.. పెళ్లి చేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు అంటూ పుకార్లు షికార్లు చేశాయి. ఆ వార్తలను కృతి సనన్ కొట్టి పారేసింది. అన్ స్టాపబుల్ షో లో బాలకృష్ణ సాక్షిగా ప్రభాస్ కూడా ఆ పుకార్లను కొట్టి పారేశాడు.

## సితారకే ఈ ఛాన్స్ ఎందుకో నాకు తెలియదు! నమ్రత

మహేష్–నమ్రతల గారాల పట్టి సితార నటి కాకముందే? బ్రాండ్ అంబాసిడర్ అయిన సంగతి తెలిసిందే. ఓ ప్రముఖ జ్యూవెలరీ ని ప్రమోట్ చేస్తూ సితార చేసిన యాడ్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఈ యాడ్ కి సితార కోటి రూపాయలు పారితోషికం అందుకున్నట్లు సమాచారం. మరి తొలిపారితోషికం సితార ఏం చేసింది? వ్యక్తివత ఖర్చుల కు పాకెట్ మనీగా ఉంచుకుందా? లేక మమ్మి డాడీల లో ఎవరికైనా ఇచ్చిందా? అన్న ఆసక్తికర ప్రశ్న సితార ముందుకెళ్లే సరికి ఎవరూ ఊహించని సమాధానం ఇచ్చింది సీతా పాప. ఓ ఛారిటీకి విరాళంగా ఇచ్చినట్లు సితార తెలిపింది. సూపర్ స్టార్ లాగే తనయది కూడా మంచి మనసుని చెప్పొచ్చు. సూపర్ స్టార్ ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల కు గుండె



ఆపరేషన్లు చేయిస్తున్నారు. ఇప్పటివరకూ ఎంతో మంది చిన్నారుల ప్రాణాలు కాపాడి ఆ తల్లిదండ్రుల కళ్లలో ఆనందం నింపారు మహేష్. ఏటా ఆయన కొన్ని వందల ఆపరేషన్లు కార్పోరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగానే చేయిస్తున్నారు. సితార కూడా తండ్రి లాగే సేవా కార్యక్రమాలు చేసే దృక్పదం ఉన్న అమ్మాయి లా కనిపిస్తోంది. ఇక నమ్రత సితార కెరీర్ గురించి చెప్పుకొచ్చింది. పిల్లలు ఇద్దరు ఏ రంగం లో రాణించాలనుకుంటే ఆ రంగం లోకి వెళ్తారు. మహేష్ గానీ...నేను గానీ వాళ్లపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాం. ఫలానా రంగం లోకి వెళ్లండని సలహాలుగానీ..బలవత్తం చేయడం గానీ చేయం. ఏ పనికి ప్రత్యేకమైన స్ట్రాటజీ అంటూ ఏమీ ఉండదు. సమయం వచ్చినప్పుడు వాటంతటవే జరిగిపోతుంటాయి. మహేష్ ఎప్పుడూ సినిమా లతో బిజీగా ఉంటారు. ఇంటి పనుల తో నేను క్షణం తీరిక లేకుండా గడుపుతున్నాను. పిల్లలు వాళ్ల ఫ్యాషన్ గురించి పెద్దగా ఆలోచించలేదు. వాళ్ల ఫ్యాషన్ ఎటువైపు ఉంటే ఆటెళ్తారు. కానీ సితారకి సినిమాలంటే ఫ్యాషనేట్ గా ఉంటుంది. ఇక సితారకి ఈ యాడ్ లో నటించే అవకాశం ఎందుకు ఇచ్చారో? నాకు తెలియదు. ఆ విషయం వాళ్లనే అడగాలి అని అన్నారు.

## కొంటె చూపుతో కాటేస్తున్న బేబమ్మ

ఉప్పెన సినిమా తో హీరోయిన్ గా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ కృతిశెట్టి. హీరోయిన్ గా మొదటి సినిమాతోనే టాలీవుడ్ లో షేక్ చేసిన ఈ అమ్మడు వరుసగా మూడు సినిమాలతో సక్సెస్ లను తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత కాస్త స్లో డౌన్ అయ్యింది. వరుసగా ది వారియర్ మరియు మాచర్ల నియోజకవర్గం సినిమాలు నిరాశపరచడంతో ఈమె రాబోయే సినిమాలపై ఆశలు



పెట్టుకుంది. నాగ చైతన్య ప్రస్తుతం వెంకట్ ప్రభు దర్శకత్వంలో నటిస్తున్న 'కస్టడీ' సినిమాలో హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్ గా వరుసగా నటిస్తున్న ఈ ఉప్పెన క్యూట్ బ్యూటీ స్కిన్ షో విషయంలో కాస్త దూరంగానే ఉంటుంది. మొదటి నుండి కూడా పరిధి దాటి స్కిన్ షో చేయకుండానే వైరల్ అవుతోంది. ఈ అమ్మడు తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. స్కిన్ షో చేయకుండానే ఇలా కొంటె చూపులతో కవ్విస్తూ ఫొటోలకు ఫోజ్ ఇచ్చింది. క్లీ వేజ్ షో ను కాస్త హెయిర్ తో కవర్ చేసి కవ్వించేలా చూస్తున్న ఈ అమ్మడి ఫొటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇలాంటి ముద్దుగుమ్మ ముందు ముందు కచ్చితంగా స్టార్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ గా మారడం ఖాయం అనే టాక్ వినిపిస్తుంది. అందాల విందు విషయంలో ఈ అమ్మడు ఇంకో అడుగు ముందుకు వేయాలని అభిమానులు ఆశ పడుతూ ఉంటే మరి కొందరు మాత్రం ఇలా కొంటె చూపులు చాలు స్క్రిన్ షో చేసినదానికంటే ఎక్కువ మత్తెక్కిస్తోంది అంటూ సరదాగా కామెంట్స్ చేస్తున్నారు.



# కొంపముంచిన ఒక్క అక్షరం..!
# మిలటరీ రహస్యాలు లీక్..!

అమెరికాకు చెందిన సైనిక రహస్యాలు, మ్యాప్‌లు, పాస్‌వర్డ్లు ఉన్న లక్షల కొద్దీ ఈమెయిల్స్ రష్యా మిత్రదేశమైన మాలి చేతికి దక్కాయి. దీనంతటికీ ఒక టైపింగ్ తప్పు కారణమైంది. సాధారణంగా అమెరికా సైన్యం తమ బృందాలతో కమ్యూనికేషన్ల కోసం .MIL అనే ఎక్స్‌టెన్షన్ ఉన్న డొమైన్ వాడుతుంది. కానీ, చాలా సందర్భాల్లో అమెరికా సైన్యంలోని వారు మెయిల్ చేసే సమయంలో పొరబాటున .ML అని టైపు చేసేవారు. దీంతో ఆ మెయిల్స్ మొత్తం మాలి డొమైన్‌కు వెళ్లాయి. వీటిల్లో అమెరికా ఆర్మీ చీఫ్ పర్యటనలో బసచేసే హొటల్ గది నంబర్ల వంటివి కూడా ఉన్నాయి.

**తిండి గింజకు యుద్ధం తిప్పలు! :** ఈ విషయాన్ని జోహన్నస్ జూర్బిర్ అనే డచ్ వ్యాపారవేత్త గుర్తించాడు. అతడు మాలి డొమైన్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నాడు. దాదాపు పదేళ్ల నుంచి అమెరికా సైన్యం నుంచి లక్షల సంఖ్యలో మెయిల్స్ వచ్చినట్లు అతడు వివరించాడు. తొలుత తమ డొమైన్‌లో లేని మెయిల్ అడ్రస్‌లకు కూడా .ML ఎక్స్‌టెన్షన్‌తో మెయిల్స్ రావడాన్ని గమనించాడు. ఆ తర్వాత ఇవి పొరబాటున వస్తున్నట్లు గమనించాడు. దీంతో ఇటువంటి మెయిల్స్‌ను ఓ చోటకు చేర్చడానికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశాడు. ఈ ఏడాది జనవరి నుంచి ఇటువంటివి 1,17,000 ఈమెయిల్స్ వచ్చాయి. వీటిల్లో అమెరికా సైన్యానికి చెందిన మ్యాప్‌లు, పాస్‌వర్డ్లు, సైనికుల మెడికల్ రికార్డులు, స్థావరాల ఫొటోలు, స్థావరాల్లో సిబ్బంది సంఖ్య, నౌకాదళ కదలికలు, నౌకల్లో సిబ్బంది వివరాలు, పన్ను వివరాలు వంటి సున్నితమైన సమాచారం ఉంది. మెయిల్స్ దారి మళ్లుతున్న విషయంపై అతడు చాలా సార్లు అమెరికా ప్రభుత్వాన్ని హెచ్చరించాడు. వీటిల్లో అమెరికా సైనిక సిబ్బంది, సైన్యంతో కలిసి పనిచేసే ట్రావెల్ ఏజెంట్లు, ఇంటెలిజెన్స్ సిబ్బంది, ప్రైవేటు కాంట్రాక్టర్లు, ఇతరులు పంపిన మెయిల్స్ అధికంగా ఉన్నాయి.

కొన్నాళ్ల క్రితం అమెరికా ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ జేమ్స్ మెక్‌కాన్విలే ఇండోనేషియాలో పర్యటించారు. ఆ పర్యటనలో ఆయన బసచేసిన రూమ్ నంబర్ల సంఖ్యలతో సహా ఉన్న ఈమెయిల్ కూడా దారి మళ్లింది. దీనిలో గ్రాండ్ హయత్ జకార్తలోని రూమ్ కీ కలెక్షన్ కూడా ఉన్నట్లు సమాచారం.

**రష్యా చేతికి దక్కే ముప్పు..** మాలి ప్రభుత్వంతో జోహన్నస్ జూర్బిర్ కాంట్రాక్టు సోమవారంతో ముగిసింది. దీంతో మాలి ప్రభుత్వమే నేరుగా ఈ డొమైన్‌ను ఆధీనంలోకి తీసుకొంది. దీంతో దారిమళ్లిన అమెరికా ఈమెయిల్స్ ఆ దేశం సిబ్బంది చూసే అవకాశం ఉంది. ఇప్పటికే రష్యాకు చెందిన వాగ్నర్ గ్రూప్ గతేడాది నుంచి మాలిలోనే ఉంది. ఉక్రెయిన్ యుద్ధానికి అవసరమైన కీలక పరికరాలను రవాణా చేయడానికి దీనిని కీలక మార్గంగా వాడుకొంటోంది. వాస్తవానికి వాగ్నర్ గ్రూప్ ప్రధాన ఆయుధం సైబర్ దాడులే. అలాంటి గ్రూప్ చేతికి ఇవి దక్కితే అమెరికాకు తిప్పలు తప్పవు. మరోవైపు ఈ విషయాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నట్లు అమెరికా రక్షణశాఖ ప్రతినిధి టామ్ గోర్మన్ వెల్లడించారు. MILకు వెళ్లకుండా మాలి డొమైన్‌కు వెళుతున్న ఈమెయిల్స్‌ను బ్లాక్ చేసినట్లు తెలిపారు. వాటిని పంపిన వారికి విషయాన్ని వెల్లడిస్తున్నామన్నారు.

# విద్యా రంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్ : రాష్ట్రంలో విద్యా రంగానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడంలో తెలంగాణ ముందజలో ఉందని అటవీ, పర్యావరణ, శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం నిర్మల్ రూరల్ మండలం అనంతపేట్ గ్రామంలో రూ.3.80 కోట్లతో నిర్మించిన కేజీబీవీ బాలికల పాఠశాల భవనాన్ని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. కేజీబీవీ ఏర్పాటు చేయడంతో పేద విద్యార్థినులకు మెరుగైన విద్య అందుతుందని పేర్కొన్నారు. పాఠశాలలో ఆధునిక వసతులతో రూ.3.80 కోట్లతో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కేజీ టు పీజీ అమలులో భాగంగా ప్రభుత్వం కేజీబీవీలను ప్రారంభించి బాలికలకు మెరుగైన విద్యనందిస్తుందని తెలపారు. సకల సౌకర్యాలతో భవన నిర్మాణం చేపడుతుండడంతో విద్యార్థినుల, ఉపాధ్యాయుల సమస్యలు తొలగిపోనున్నాయి.

# డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకపోతే.. ప్రగతిభవన్‌ను ముట్టడిస్తాం: ఎంపీ కోమటిరెడ్డి



హైదరాబాద్: మరో వారం రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని.. లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు ఎంపీ లేఖ రాశారు. లక్షల మంది నిరుద్యోగుల అవస్థలు చూడలేకే బహిరంగ లేఖ రాస్తున్నట్లు పేర్కొన్నారు. "కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఏం జరుగుతోంది? నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో సాగిన ఉద్యమ ఆకాంక్షలు ఎక్కడా నెరవేరలేదు. కాంగ్రెస్ హయాంలో మొదలుపెట్టిన ప్రాజెక్టులను ఎక్కడికక్కడే వదిలేశారు. మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మర్చారు. అనవసర ఆర్భాటాలకు పోయి ప్రజాధనం వృథా చేస్తున్నారు. తొమ్మిదిన్నరేళ్లలో తెలంగాణలో ఇచ్చిన నోటిఫికేషన్లు, భర్తీ చేసిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి. ముఖ్యంగా టీచర్ పోస్టుల భర్తీ అంశంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఉపాధ్యాయ పోస్టుల కోసం పెద్ద సంఖ్యలో అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు టెట్ రాసి ఎంతో మంది సిద్ధంగా ఉన్నారు. తెలంగాణలో తొలి టెట్ పరీక్ష 2016 మే 22న జరిగింది. పేపర్-1కు 88,158 మంది హాజరు కాగా 48,278 మంది అర్హత సాధించారు. పేపర్-2ను 2,51,924 మంది రాయగా.. 63,079 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో టెట్ పరీక్ష 2017 జులై 23న నిర్వహించారు. పేపర్-1ను 98,848 మంది రాయగా.. 56,708 మంది పాసయ్యారు. పేపర్-2కు 2,30,932 మంది హాజరుకాగా.. 45,045 మంది ఉత్తీర్ణులయ్యారు. మూడో టెట్ 2020 జూన్ 12న జరిగింది. పేపర్-1కు 3.18 లక్షల మంది హాజరు కాగా 1,04,578 మంది ఉత్తీర్ణత సాధించారు. పేపర్-2ను 2,50,897 మంది రాయగా.. 1,24,535 మంది పాసయ్యారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం 12,500 మంది డీఎడ్, మరో 15,000 మంది బీఎడ్ కోర్సు పూర్తి చేస్తున్నారు. రాష్ట్రంలో వేలల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఓవైపు రిటైర్ అవుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. వారి స్థానాలను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది" అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

# కోకాపేటలో 11 ఎకరాల భూ కేటాయింపు.. భారాస, రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు



హైదరాబాద్: కోకాపేటలో భారాసకు 11 ఎకరాల భూ కేటాయింపుపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. రాష్ట్ర ప్రభుత్వం, భారాసకు నోటీసులు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

ఎకరం రూ.50కోట్లు పలుకుతున్న విలువైన భూమిని రూ.3.41కోట్లకే కేటాయించారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. భూ కేటాయింపు డాక్యుమెంట్లన్నీ రహస్యంగా పెట్టారని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై నోటీసులు జారీ చేసిన హైకోర్టు.. తదుపరి విచారణను ఆగస్టు 16కి వాయిదా వేసింది.

# తెలంగాణ సాగుపై కాంగ్రెస్ కుట్రలు : ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట: సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధి పులిజాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నిర్వహించిన రైతు నిరసన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఉచిత విద్యుత్తులో తెలంగాణ రాష్ట్రం దేదీప్యమానంగా వెలుగొందుతుంటే, పరాయి పాలకులు, కిరాయి నేతల కాంగ్రెస్ పార్టీ కళ్లు మండుతున్నాయని విమర్శించారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డి చంద్రభూతం లెక్క తెలంగాణను పట్టుకుని పీడిస్తున్న పెనుభూతంగా మారిండని, రాష్ట్ర ప్రజలు మండిపడుతున్నారని తెలిపారు. ఈ వెలుగులను ఆర్పాలని, రైతులను చీకట్లో పాము కాటుకు, కరెంటు షాక్ కు బలి చేయాలని, తెలంగాణ వ్యవసాయాన్ని తేరుకోకుండా చేయాలని అధికారం హస్తగతం చేసుకోవడానికి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలు బట్టబయలు అవుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ఉచితంగా కరెంటు ఇచ్చి, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి, రైతుబంధుతో పెట్టుబడి సాయం అందించి, రైతు బీబీ తీసుకొచ్చి, రైతు వేదికలు నిర్మించి, రైతు కల్లాలు ఏర్పాటు చేసి, పండిన పంటను కొనుగోలు కేంద్రాలతో ధాన్యం మొత్తం సేకరించి తెలంగాణలో రైతులు మూడు పంటలతో ముచ్చటగా మురిసిపోయేటట్లు చేస్తున్నరని వివరించారు.

అమెరికాలో కాంగ్రెస్ రైతు వ్యతిరేక కుట్రలు రేవంత్ రెడ్డి రూపంలో బయటపడడంతో తెలంగాణ రైతులు భగ్గు మంటున్నారని, కరెంటు వ్యతిరేక కాంగ్రెస్ తీరుపై రైతన్నలు కదం తొక్కుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం, ఎల్లమ్మ ఆలయం నిర్మాణాలకు సహాయ సహకారాలు అందజేస్తునని, విద్యుత్ సమస్యలు లేకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



# వచ్చే నాలుగు రోజుల్లో.. భారీ, అతి భారీ వర్షాలు

## ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసిన వాతావరణశాఖ

హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా బుధవారం అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. గురు, శుక్రవారాల్లోనూ భారీగా కొనసాగనున్నాయని తెలిపింది. బుధవారంలోగా బంగాళాఖాతం వాయవ్య ప్రాంతంపై గాలులతో ఉపరితల ఆవర్తనం ఏర్పడనుందని అంచనా. మరోవైపు ఝూర?ండ్ దక్షిణ ప్రాంతంపై 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు మరో ఉపరితల ఆవర్తనం ఉంది. వీటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నందున భారీవర్షాలు కురిసే సూచనలున్నాయి.

సోమవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అక్కడక్కడ స్వల్పంగా వర్షాలు కురిశాయి. అత్యధికంగా మెండోరా(నిజామాబాద్ జిల్లా)లో 1.9, భైంసా(నిర్మల్)లో 1.2, గోధూరు(జగిత్యాల)లో 1.1 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

# భూ కబ్జా ఆరోపణలపై పొంగులేటి క్లారిటీ



హైదరాబాద్: ఖమ్మంలో పొంగులేటి, ఆయన సోదరుడు ప్రసాదరెడ్డికి చెందిన ఎస్ఆర్‌గార్డెన్ ఫంక్షన్ హాల్‌పై ఎన్నెస్పీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి.. 21 గుంటలు ఎన్నెస్పీది అంటూ నిర్ధారించడంపై కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన పొంగులేటి.. బీఆర్ఎస్‌లో ఉంటే ఇక న్యాయం... వేరే పార్టీలోకి వెళ్తే ఒక న్యాయమా? అంటూ మండిపడ్డారు. కండువాలు మార్చుకున్నాక ఎవరికి ఎంత భూమి వచ్చిందో బయట పడుతుందన్నారు. తనలాంటి వ్యక్తి 20 గంటల కబ్జా చేశానని నింద మోపడం దారుణమన్నారు. తమ కుటుంబ సభ్యులకు అక్కడ 130 ఎకరాల భూమి ఉందని.. ఉద్దేశపూర్వకంగా కోర్టు సెలవులు చూసి తనను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. 14 సంవత్సరాల నుంచి లేని ప్రాబ్లం ఇప్పుడేలా వచ్చిందని ప్రశ్నించారు. ఖమ్మం సభ సక్సెస్ అయ్యిందనే ప్రభుత్వం అక్కసు అంటూ మండిపడ్డారు. న్యాయ స్థానం ద్వారా పోరాటం చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతుందని ఈ నిందలు వేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే సిగ్నల్స్ వస్తున్నాయని... అందుకే పార్టీపై బీఆర్ఎస్ నాయకులు భయపడుతున్నారని అన్నారు. ఈ నెల చివర్లో కొల్లాపూర్ సభ ఉంటుందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

**కల్వకుంట్ల కుటుంబానికి తప్ప ఎవరికీ మంచి జరగలేదు :** కాగా.. ఈరోజు ఉదయం పొంగులేటి గాంధీభవన్‌కు వచ్చారు. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత మొదటిసారి ఆయన గాంధీభవన్ వచ్చారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మార్యద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ... పార్టీలో చేరిన కొద్ది రోజులకే తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. చిత్తశుద్ధితో, సీనియర్లు అందరితో కలిసి పార్టీని అధికారంలోకి తేవడానికి కష్టపడతానని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఆశించిన ఫలితాలు రాలేదని.. తెలంగాణ ఏర్పడి 9 సంవత్సరాలైన ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారన్నారు. కల్వకుంట్ల కుటుంబం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. స్కీములు ప్రకటించడం తప్పా నెరవేర్చలేదన్నారు. తెలంగాణ వచ్చి కల్వకుంట్ల కుటుంబానికి తప్ప ఎవరికి మంచి జరగలేదని విమర్శించారు. కరెంట్ కనుక్కున్నదే కేసీఆర్ అనేలాగా చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే బీఆర్ఎస్ నాయకుల పరిస్థితి ఎలా ఉండేదని ప్రశ్నించారు. అనేక మంది పోరాటాల ఫలితం తెలంగాణ రాష్ట్రమని అన్నారు. ఒక గంట, ఒక రోజు నిరాహార దీక్షతో తెలంగాణ రాలేదని తెలిపారు. కేసీఆర్ వాగ్ధానాలు వాగ్దానాలుగానే ఉన్నాయని.. ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది కేసీఆర్ కాదా అని నిలదీశారు. రాష్ట్రాన్ని అప్పులమయం చేసి కల్వకుంట్ల కుటుంబ సభ్యులు బ్యాంక్ బ్యాలెన్స్ పెంచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి అందరం ఋణపడి ఉన్నామన్నారు. కాంగ్రెస్ పార్టీలో హేమాహేమీలు ఉన్నారని.. అందరం కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. ఆచరణకు సాధ్యమయ్యేవే కాంగ్రెస్ చెబుతోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజల నుంచి దోచుకున్న సొమ్మును వడ్డీతో సహా కట్టిస్తామన్నారు. కాంగ్రెస్ అభిమానులను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో వర్షాలు.. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్న జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి



హైదరాబాద్: భారీ వర్షాల దృష్ట్యా జీహెచ్ఎంసీ సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి సూచించారు. జోనల్ కమిషనర్లు, ఈవీడీఎం సిబ్బంది నిరంతరం పరిస్థితులను సమీక్షించాలన్నారు. వరదను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో కొత్త సెల్లార్ తవ్వకాలను అనుమతించకూడదని చెప్పారు. ప్రజలు తమకు ఎలాంటి మస్యలు ఉన్నా 040-21111111 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. హైదరాబాద్ వ్యాప్తంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నది. దీంతో పలు చోట్ల రోడ్లపై నీళ్లు నిలిచిపోయాయి. అయితే జీహెచ్ఎంసీ సిబ్బంది వచ్చిన నీరు వచ్చినట్లే వెళ్లిపోయేలా చూస్తున్నారు.

కాగా, సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం రాత్రి వరకు భారీ వర్షాల నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు మరికొన్ని జిల్లాల్లో అతిభారీ వర్షాల నేపథ్యంలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. బుధవారం నుంచి గురువారం సాయంత్రం వరకు ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షాలు ఉంటాయని ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

# సీఎం కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్న మంత్రి జగదీష్‌రెడ్డి



హైదరాబాద్ : రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి జన్మదినం నేడు. 58 వసంతాలు పూర్తి చేసుకుని 59వ ఒడిలోకి అడుగిడారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంత్రి జగదీశ్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అలాగే రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు, ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు వేరు వేరుగా మంత్రి జగదీష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, మంత్రి జగదీశ్‌రెడ్డి తన పుట్టినరోజును పురస్కరించుకొని గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఎంపీ సంతోష్ కుమార్ పిలుపుమేరకు.. బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో తన సతీమణి సునితతో కలసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు దూదిమెట్ల బాలరాజు యాదవ్, రామచంద్ర నాయక్, అనిల్ కుర్మాచలం, రాజీవ్ సాగర్, పల్లె రవికుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప నాయకుడిని కోల్పోయాం.. ఉమెన్ చాందీ మృతిపై రేవంత్



హైదరాబాద్: కేరళ మాజీ ముఖ్యమంత్రి ఉమెన్ చాందీ మృతి పట్ల టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సంతాపం తెలియజేశారు. ప్రజా నాయకులు ఉమెన్ చాందీ, ఆయన మరణం కేరళకు తీరని లోటన్నారు. ఒక గొప్ప నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు సార్లు ముఖ్యమంత్రిగా, నాలుగు సార్లు మంత్రిగా, 12 సార్లు ఎమ్మెల్యేగా దాదాపు ఐదున్నర దశాబ్దాల పాటు ప్రజా జీవితంలో వివిధ హొదాలలో చాందీ పని చేశారన్నారు. ఆయన మరణం కేరళ ప్రజానీకానికి కాంగ్రెస్ పార్టీ కి తీరని లోటని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆయన మృతి పట్ల రేవంత్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com